వాయిస్ ఆఫ్ ప్రజలు

# వాయిస్ టుడే

VOICE OF PRAJALU

TGTEL/25/A2649

తెలుగు దినపత్రిక

www.Voicetodaynews.com
https://epaper.voicetodaynews.com

జనగాత్రం - మననేత్రం

Follow

పేజీలు 10

ఆదివారం, మార్చి 15, 2026

HYDERABAD RANGAREDDY NALGONDA MAHABOOBNAGAR MEDAK KHAMMAM KARIMNAGAR WARANGAL NIZAMBAD ADILABAD


## బండి సంజయ్ పాదయాత్రలో... డ్రోన్ తగిలి తేనెటీగల దాడి



కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ పాదయాత్ర సందర్భంగా తేనెటీగలు దాడి చేశాయి. 'అంజన్న ఆశీర్వాద యాత్ర' పేరిట కరీంనగర్‌లోని మహాశక్తి ఆలయం నుంచి కొండగట్టు వరకు చేపట్టిన పాదయాత్రలో బీజేపీ కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. రామడుగు మండలం కోన్‌రావుపేట సమీపంలో పాదయాత్ర దృశ్యాలను చిత్రీకరించేందుకు పలువురు అభిమానులు డ్రోన్ ఎగురవేశారు. అది పక్కనే ఉన్న చెట్టుకు ఉన్న తేనెతుట్టెకు తగిలింది. దీంతో తేనెటీగలు లేచి, పలువురు కార్యకర్తలపై దాడి చేశాయి. తేనెటీగల దాడితో కార్యకర్తలు భయాందోళనకు గురయ్యారు. తేనెటీగలు నలుగురు కార్యకర్తలపై దాడి చేశాయి. అప్రమత్తమైన బండి సంజయ్, ఆయన సిబ్బంది వారిని వెంటనే సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనతో పాదయాత్రకు కొద్దిసేపు అంతరాయం ఏర్పడింది.



దొర పాడెను మోసిన పోలీస్ బాస్‌లు..
**గౌరవ వందనంతో తుది వీడ్కోలు**

## షాపింగ్‌కు తీసుకెళ్లలేదని..
## కన్నబిడ్డల గొంతు నులిమి తల్లి ఆత్మహత్య





**బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డి ఫామ్‌హౌస్‌లో డ్రగ్స్ పార్టీ.. కాల్పుల కలకలం!**




# మూసీ పేరుతో భూముల దోపిడీ కుట్ర

- లక్షన్నర కోట్ల ప్రణాళికపై కేటీఆర్ తీవ్ర ఆరోపణలు
- వేలాది ఇళ్ల కూల్చివేతకు ప్రభుత్వం సిద్ధమవుతోందని విమర్శ
- 3,300 ఎకరాల విలువైన భూములపై కన్నేసినట్లు ఆరోపణ
- అవినీతి ప్రణాళికను అడ్డుకుంటామని హెచ్చరిక
- ఒక్క ఇల్లు కూల్చకుండా అభివృద్ధి చేశామని వ్యాఖ్య
- మూసీకి 16 వేల కోట్లే సరిపోతుందని స్పష్టం
- బాధితుల వెంట ఉంటామని కేటీఆర్ హామీ

హైదరాబాద్ : మూసీ సుందరీకరణ పేరుతో రాష్ట్ర ప్రభుత్వం భారీ భూములపై కన్నేసిందని భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఆరోపించారు. లక్షన్నర కోట్ల రూపాయల అంచనాలతో వేలాది ఇళ్లను కూల్చివేసి పెద్ద స్థాయిలో భూములను స్వాధీనం చేసుకునే ప్రయత్నం జరుగుతోందని విమర్శించారు. మూసీ అభివృద్ధికి తమకు ఎలాంటి వ్యతిరేకత లేదని, కానీ ప్రజల ఇళ్లను కూల్చివేసే విధానాన్ని మాత్రం అడ్డుకుంటామని స్పష్టం చేశారు. మూసీ పునరుద్ధరణపై నిర్వహించిన కార్యక్రమంలో కేటీఆర్ మాట్లాడుతూ సరైన ప్రణాళికలు లేకుండా ప్రభుత్వం ముందుకు వెళ్తోందన్నారు. సామాజిక ప్రభావం, పర్యావరణ ప్రభావం వంటి అధ్యయనాలు చేయకుండా వేలాది ఇళ్లను కూల్చివేస్తామని చెప్పడం ప్రజల్లో భయాందోళనలు

(మిగతా 2వ పేజీలో)

# గల్ఫ్‌లో యుద్ధ గర్జన

**ఖర్గ్ దీవిపై అమెరికా బాంబుల వర్షం.. ఇరాన్ ప్రతీకారంగా క్షిపణులు, డ్రోన్ల దాడులు**

**ఇజ్రాయెల్‌పై నిమిషాల్లో వెయ్యికిపైగా మిసైళ్లు.. యూఏఈ చమురు కేంద్రంలో భారీ అగ్నిప్రమాదం**

**హార్ముజ్ జలసంధి వద్ద ఉద్రిక్తతలు.. యుద్ధ నౌకల తరలింపు.. భూతల దాడుల దిశగా సన్నాహాలు**



దుబాయ్/వాషింగ్టన్: పశ్చిమాసియాలో యుద్ధ పరిస్థితులు మరింత తీవ్రరూపం దాల్చుతున్నాయి. ఇరాన్‌కు ఆర్థికంగా కీలకమైన ఖర్గ్ దీవిపై అమెరికా భారీ స్థాయిలో వైమానిక దాడులు జరపగా, ప్రతీకారంగా ఇరాన్ గల్ఫ్ దేశాలు, ఇజ్రాయెల్‌పై క్షిపణులు, డ్రోన్లతో విరుచుకుపడింది. దీంతో ప్రాంతమంతా ఉద్రిక్తతలు మరింత పెరిగాయి. గల్ఫ్ ప్రాంతంలో అమెరికా సైనిక స్థావరాలు ఉన్న ప్రాంతాల నుంచి పౌరులు వెంటనే వెళ్లిపోవాలని ఇరాన్ హెచ్చరించింది. మరోవైపు అమెరికా మరిన్ని యుద్ధ నౌకలను గల్ఫ్‌కు తరలిస్తూ భూతల దాడులకు కూడా సిద్ధమవుతోందనే సమాచారం వెలువడుతోంది.

### 90 సైనిక లక్ష్యాల ధ్వంసం

ఇరాన్ చమురు ఎగుమతులకు కీలక కేంద్రంగా ఉన్న ఖర్గ్ దీవిపై అమెరికా సైన్యం భారీ దాడులు చేసింది. దీవిలో పదుల సంఖ్యలో పేలుళ్లు సంభవించినట్టు సమాచారం. మందుపాతరల నిల్వ కేంద్రాలు, క్షిపణి నిల్వ కేంద్రాలు, బంకర్లు సహా మొత్తం 90కి పైగా సైనిక లక్ష్యాలను ధ్వంసం చేసినట్టు అమెరికా సైనిక కమాండ్ తెలిపింది. కీలక సైనిక స్థావరాలను పూర్తిగా నాశనం చేసినట్టు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు. అయితే చమురు ఎగుమతులకు

(మిగతా 2వ పేజీలో)

# భారాస-కాంగ్రెస్‌పై ప్రజల నమ్మకం పోయింది: బండి సంజయ్



- రాష్ట్రంలో డబుల్ ఇంజిన్ ప్రభుత్వం ఖాయం అని ధీమా
- కరీంనగర్ - కొండగట్టు అంజన్న ఆశీర్వాద పాదయాత్ర
- దాదాపు 40 కిలోమీటర్ల దూరం కాలినడకన ప్రయాణం
- భాజపా నాయకులు, కార్యకర్తల భారీ పాల్గొనడం
- వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో మార్పు ఖాయమని వ్యాఖ్య
- కొండగట్టు ఆలయ అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక హామీ
- రైతు భరోసా డబ్బులు ఇవ్వకుండా మోసం చేస్తున్నారని ఆరోపణ

కరీంనగర్: రాష్ట్రంలో ప్రజలు భారాస, కాంగ్రెస్ పార్టీలను నమ్మి మోసపోయారని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ విమర్శించారు. ఇకపై ఆ రెండు పార్టీలను ప్రజలు నమ్మే పరిస్థితుల్లో లేరని వ్యాఖ్యానించారు. వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో డబుల్ ఇంజిన్ ప్రభుత్వం ఏర్పడటం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. శనివారం కరీంనగర్ నుంచి కొండగట్టు వరకు నిర్వహించిన అంజన్న ఆశీర్వాద పాదయాత్ర ప్రారంభ సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్యలు

(మిగతా 2వ పేజీలో)



## తెలంగాణలో వంటగ్యాస్ కొరత లేదు: ఉత్తమ్ కుమార్ రెడ్డి

# మూసీ పేరుతో భూముల దోపిడీ కుట్ర

కలిగిస్తోందని విమర్శించారు. గత ప్రభుత్వ కాలంలో మూసీ అభివృద్ధికి సమగ్ర ప్రణాళికలు సిద్ధం చేశామని ఆయన తెలిపారు. ఉప్పల్, నాగోల్ ప్రాంతాల్లో ఇప్పటికే ఆరు కిలోమీటర్ల మేర అభివృద్ధి పనులు పూర్తి చేశామని చెప్పారు. ఒక్క ఇల్లు కూడా కూల్చకుండా అభివృద్ధి సాధ్యమేనని అప్పుడే నిరూపించామని పేర్కొన్నారు.



**లక్షన్నర కోట్లు ఎందుకు?**

మూసీ పొడవు కేవలం 55 కిలోమీటర్లు మాత్రమే ఉన్నప్పటికీ లక్షన్నర కోట్ల రూపాయల అంచనా ఎందుకు పెట్టారో ప్రభుత్వం చెప్పాలని కేటీఆర్ ప్రశ్నించారు. వందల కిలోమీటర్ల గంగా నది పునరుద్ధరణకు తక్కువ ఖర్చు అయ్యిందని గుర్తుచేశారు.

**3,300 ఎకరాల భూములపై దృష్టి**

మూసీ పరివాహక ప్రాంతంలో ఉన్న 3,300 ఎకరాల భూముల విలువ లక్షన్నర కోట్ల రూపాయలకు పైగా ఉంటుందని కేటీఆర్ పేర్కొన్నారు. ఆ భూములను స్వాధీనం చేసుకోవడానికే ఈ ప్రణాళిక రూపొందించారని ఆరోపించారు. ప్రణాళిక రూపకల్పనకే వందల కోట్ల రూపాయలు ఖర్చు పెట్టడం అనుమానాస్పదమన్నారు.

**బఫర్ ప్రాంతం పేరుతో భయపెట్టడం**

బఫర్ ప్రాంతం పేరుతో ప్రజలను భయపెట్టి వారి ఇళ్లను కూల్చివేయాలని ప్రభుత్వం చూస్తోందని కేటీఆర్ విమర్శించారు. పెద్దల ఇళ్లు, వ్యవసాయ భూములపై మాత్రం చర్యలు తీసుకోవడం లేదని అన్నారు. సాధారణ ప్రజల ఇళ్లకే నోటీసులు ఇస్తున్నారని ఆరోపించారు.

**16 వేల కోట్లతోనే సాధ్యం**

మూసీ సమగ్ర అభివృద్ధికి గత ప్రభుత్వం సిద్ధం చేసిన అంచనా వ్యయం కేవలం 16 వేల కోట్లు మాత్రమేనని కేటీఆర్ చెప్పారు. గోదావరి నుంచి నీటిని తీసుకువచ్చి మూసీలోకి విడుదల చేయడానికి కూడా సరళమైన ప్రణాళిక సిద్ధం చేశామని వివరించారు. ఇప్పుడు ప్రభుత్వం అదే పనులకు భారీ ఖర్చు చూపించడం అవినీతికి సంకేతమని ఆరోపించారు. మూసీ ప్రణాళిక పేరుతో ప్రజల ఇళ్లను కూల్చివేయాలంటే తమ పార్టీ ఊరుకోదని కేటీఆర్ హెచ్చరించారు. హైదరాబాద్ నగర ప్రజల హక్కులను కాపాడుతామని చెప్పారు. బాధితులు ఐక్యంగా పోరాడితే తమ ప్రభుత్వం వచ్చిన తర్వాత వారి ఇళ్లు, భూములను రక్షిస్తామని హామీ ఇచ్చారు.

# గల్ఫ్‌లో యుద్ధ గర్జన



సంబంధించిన మౌలిక సదుపాయాలను లక్ష్యంగా చేసుకోలేదని తెలిపారు. అమెరికా దాడులకు ప్రతీకారంగా ఇరాన్ గల్ఫ్ దేశాలు, ఇజ్రాయెల్‌పై క్షిపణులు, డ్రోన్ల దాడులు ప్రారంభించింది. అమెరికాతో సంబంధమున్న చమురు వ్యవస్థలన్నీ తమ లక్ష్యమని ఇరాన్ విప్లవ గార్డు దళం ప్రకటించింది. అమెరికా సైన్యం ఉన్న ప్రాంతాలన్నింటినీ లక్ష్యంగా చేసుకుంటామని హెచ్చరించింది. ఇరాక్ రాజధాని బాగ్దాద్‌లోని అమెరికా రాయబార కార్యాలయం పరిసర ప్రాంతంలో కూడా క్షిపణి దాడి జరిగినట్టు సమాచారం. ఇరాన్ డ్రోన్ దాడుల్లో యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లోని ఒక చమురు కేంద్రం తీవ్రంగా దెబ్బతింది. అక్కడి నుంచి ఎగిసిపడుతున్న మంటలు, పొగలు దూరం నుంచి కనిపిస్తున్నాయి. గల్ఫ్ ప్రాంతంలోని పలు నౌకాశ్రయాలను ఖాళీ చేయాలని ఇరాన్ హెచ్చరించింది. అయితే తమ వైమానిక రక్షణ వ్యవస్థ తొమ్మిది బాలిస్టిక్ క్షిపణులు, ముప్పై మూడు డ్రోన్లను అడ్డుకుందని యూఏఈ అధికారులు తెలిపారు.

**ఇజ్రాయెల్‌పై క్షిపణుల మోత**

ఇజ్రాయెల్‌పై ఇరాన్ భారీ దాడులకు దిగింది. నిమిషాల వ్యవధిలోనే వెయ్యికిపైగా క్షిపణులు ప్రయోగించినట్టు సమాచారం. టెల్ అవీవ్, జెరూసలేం, ఈలట్ నగరాలు పేలుళ్లతో దద్దరిల్లాయి. పలు ప్రాంతాల్లో భారీ నష్టం సంభవించగా అనేక మంది గాయపడ్డారు. గల్ఫ్ ప్రాంతంలో అమెరికా సైనిక బలగాలను పెంచుతోంది. ఇప్పటికే పలు యుద్ధ నౌకలు అక్కడ మోహరించాయి. జపాన్ నుంచి మరీన్ దళంతో పాటు యాంఫిబియస్ యుద్ధ నౌకలను కూడా తరలిస్తున్నారు. సుమారు 2,500 మంది నావికా దళాన్ని త్వరలోనే గల్ఫ్‌కు పంపనున్నట్టు సమాచారం. ప్రపంచ చమురు రవాణాకు అత్యంత కీలకమైన హార్ముజ్ జలసంధి వద్ద పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. ఈ మార్గాన్ని ఇరాన్ అడ్డుకుంటే తీవ్ర చర్యలు తీసుకుంటామని అమెరికా హెచ్చరించింది. అంతర్జాతీయ రవాణా నిరాటంకంగా కొనసాగేందుకు ప్రపంచ దేశాలు యుద్ధ నౌకలు పంపాలని కూడా అమెరికా కోరింది. ఇదే సమయంలో లెబనాన్‌పై ఇజ్రాయెల్ దాడులు కొనసాగుతున్నాయి. రాజధాని బీరూట్ సహా పలు ప్రాంతాల్లో క్షిపణి దాడులు జరగడంతో ఇప్పటివరకు 826 మంది మరణించినట్టు అక్కడి ప్రభుత్వం తెలిపింది. దేశవ్యాప్తంగా సుమారు 8.5 లక్షల మంది ప్రజలు నిర్వాసితులయ్యారు.

## తెలంగాణలో గ్యాస్ కొరత లేదు

హైదరాబాద్ : తెలంగాణలో ఎల్పీజీ గ్యాస్ కొరత ఉందంటూ సామాజిక మాధ్యమాల్లో వస్తున్న వార్తలపై రాష్ట్ర ప్రభుత్వం స్పష్టత ఇచ్చింది. గృహ అవసరాలకు వాడే డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్ల సరఫరాలో ఎలాంటి అంతరాయం లేదని, కేవలం కమర్షియల్ సిలిండర్ల విషయంలోనే కొంత కొరత ఉందని పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ మేరకు ఆయన ఎల్పీజీ డిస్ట్రిబ్యూటర్స్ అసోసియేషన్ , ఆయిల్ కంపెనీల ప్రతినిధులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. గృహ వినియోగదారులకు గ్యాస్ కొరత లేదని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. కమర్షియల్ గ్యాస్ సిలిండర్ల కొరత మాత్రమే ఉందని చెప్పారు. అయినా ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని.. అవసరం గ లేకున్నా ముందస్తుగా గ్యాస్ బుక్ చేసుకోవద్దని ఉత్తమ్ సూచించారు. కావాలని గ్యాస్ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరిం చారు. ఎల్పీజీ ఆయిల్ సరఫరా సంస్థలతో సమీక్షించిన మంత్రి ఉత్తమ్..' ప్రస్తుత పరిస్థితులపై నిన్న అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించాం. రాష్ట్రంలో 810 మంది ఎల్పీజీ డిస్ట్రిబ్యూటర్ లు ఉన్నారు. 1.3 కోట్ల డోమాస్టిక్ కన్జుమర్స్ ఉన్నారు. 7.5 లక్షల కమర్షియల్ కన్జుమర్స్ ఉన్నారు. నెలకు యావరేజ్ 60 లక్షల సిలిండర్లు డొమెస్టిక్ వాడుతున్నారు. కమర్షియల్ సిలిండర్ విషయంలోనే కొరత ఏర్పడుతోంది. డొమస్టిక్ కన్జుమర్లు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ప్రస్తుతం ఎలాంటి కొరత లేదు. ఆందోళనతో ముందస్తుగా అవసరం లేకున్నా గ్యాస్ బుక్ చేసుకుంటున్నారు. గృహ అవసర సిలిండర్లకు కొరత లేదు. కమర్షియల్ సిలిండర్లను కేంద్రం 20 శాతం సప్లై చేస్తోందన్నారు. కమర్షియల్ సిలిండర్ల విషయంలో కేంద్రానికి లేఖ రాశాం. ప్రతి రోజు 2.15 లక్షల ఎల్పీజీ డొమాస్టిక్ సిలిండర్లు సప్లై చేస్తారు. నిన్న మొన్న 2.3 లక్షలు సప్లై చేశారు. కమర్షియల్ సిలిండర్లు రోజుకు 23 వేలు సప్లై చేసే వాళ్లు. కానీ ప్రస్తుతం 6200 సిలిండర్లు మాత్రమే ఇస్తున్నారు. స్కూల్స్, కాలేజెస్, సెంటర్, స్టేట్ గవర్నమెంట్ సంస్థలకు కమర్షియల్ సిలిండర్లు విషయంలో ప్రాధాన్యత ఇస్తున్నాం. సివిల్ సప్లై భవన్ లో కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని. ఎవరైన కృత్రిమంగా గ్యాస్ కొరత సృష్టించినా..బ్లాక్ మార్కెట్ చేసినా హెల్ఫ్ లైన్ 180042500344 కు కాల్ చేయొచ్చని' మంత్రి ఉత్తమ్ చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా 1.3 కోట్ల మంది యాక్టివ్ గృహ వినియోగదారులు ఉన్నారని, వారికి సరిపడా సిలిండర్లను ఆయిల్ కంపెనీలు అందిస్తున్నాయని మంత్రి తెలిపారు. గతంలో రోజుకు సగటున 2.15 లక్షల సిలిండర్లు సరఫరా అయ్యేవని, ప్రస్తుత డిమాండ్‌ను బట్టి దానిని 2.3 లక్షలకు పెంచినట్లు ఆయన వెల్లడించారు. గ్యాస్ కొరత ఉందన్న ఆందోళనతో వినియోగదారులు అనవసరంగా ఓవర్ బుకింగ్ చేసి సిస్టమ్‌ను ఓవర్‌లోడ్ చేయవద్దని ఆయన విజ్ఞప్తి చేశారు.హోటళ్లు, ఇతర వ్యాపార సంస్థలు వాడే 19 కేజీల కమర్షియల్ సిలిండర్ల సరఫరాలో మాత్రం తగ్గుదల ఉన్న మాట వాస్తవమేనని మంత్రి అంగీకరించారు. కేంద్ర ప్రభుత్వం నిర్దేశిరచిన కొత్త మార్గదర్శకాల వల్ల గతంలో ఉన్న సరఫరాలో కేవలం 20 శాతం మాత్రమే ప్రస్తుతం అందుబాటులో ఉందని ఆయన వివరించారు. గతంలో రోజుకు 23,000 కమర్షియల్ సిలిండర్లు సరఫరా అయ్యే చోట, ఇప్పుడు కేవలం 6,200 మాత్రమే వస్తున్నాయని, ఈ సమస్యను పరిష్కరించేందుకు కేంద్ర ప్రభుత్వంతో చర్చలు జరుపుతామని ఆయన హామీ ఇచ్చారు. రాష్ట్రంలో గ్యాస్ పంపిణీ సక్రమంగా జరిగేలా చూడటంతో పాటు, అక్రమ నిల్వలను అరికట్టేందుకు రాష్ట్ర , జిల్లా స్థాయి కమిటీలను ఏర్పాటు చేసినట్లు మంత్రి తెలిపారు. గృహ అవసరాల సిలిండర్లు పక్కదారి పట్టకుండా కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.



## భారాస-కాంగ్రెస్‌పై ప్రజల నమ్మకం పోయింది: బండి సంజయ్

చేశారు. కరీంనగర్ నగరంలోని మహాశక్తి ఆలయం వద్ద ఉదయం ప్రారంభమైన పాదయాత్రలో బండి సంజయ్‌తో పాటు నగర మేయర్ శ్రీనివాస్, ఉపమేయర్ సునీల్‌రావు, భాజపా కార్పొరేటర్లు, పార్టీ మద్దతుతో గెలిచిన సర్పంచులు, ఉపసర్పంచులు పాల్గొన్నారు. దాదాపు 40 కిలోమీటర్ల దూరం కాలినడకన సాగిన ఈ యాత్ర రాత్రి సమయంలో కొండగట్టుకు చేరుకుంది.

**భక్తి వాతావరణంలో యాత్ర**

పాదయాత్ర మార్గమంతా భక్తి వాతావరణం నెలకొంది. కోలాటాలు, డప్పు, డోలు కళాకారులు తమ ఆటపాటలతో పాల్గొన్న వారిని ఉత్సాహపరిచారు. వందలాది మంది నాయకులు, కార్యకర్తలు యాత్రలో పాల్గొన్నారు. ట్రాఫిక్‌కు ఇబ్బంది కలగకుండా పోలీసులు మార్గమంతా భద్రతా ఏర్పాట్లు చేశారు. కొండగట్టు ఆలయం వద్ద రాత్రి ఆలయ ప్రధాన ద్వారం మూసివేసిన అనంతరం బండి సంజయ్ ప్రజాప్రతినిధులతో కలిసి మొక్కులు చెల్లించుకున్నారు. కరీంనగర్ కార్పొరేషన్‌ను భాజపా కైవసం చేసుకుంటే పాదరక్షలు ధరించకుండా కాలినడకన కొండగట్టుకు వస్తానని మొక్కుకున్నానని ఆయన తెలిపారు.

**కొండగట్టు అభివృద్ధి హామీ**

వచ్చే ఎన్నికల్లో భాజపా అధికారంలోకి వస్తే కొండగట్టు ఆలయాన్ని ప్రత్యేక ప్రణాళికతో అభివృద్ధి చేస్తామని బండి సంజయ్ హామీ ఇచ్చారు. తాను ఎంపీగా గెలిచిన తరువాత కేంద్ర ప్రభుత్వ పథకంలో కొండగట్టు ఆలయాన్ని చేర్చామని, అయితే అప్పటి రాష్ట్ర ప్రభుత్వం సహకరించకపోవడంతో పనులు ముందుకు సాగలేదని అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రైతు భరోసా డబ్బులు సకాలంలో ఇవ్వకుండా రైతులను ఇబ్బందులకు గురిచేస్తోందని బండి సంజయ్ ఆరోపించారు. ఒక్కో రైతుకు దాదాపు 50 వేల రూపాయల వరకు బకాయిలు ఉన్నాయని చెప్పారు.

**ఎమ్మెల్యే వ్యాఖ్యలపై ఆగ్రహం**

ఇటీవల జరిగిన ఒక కార్యక్రమంలో తుంగతుర్తి ఎమ్మెల్యే హిందువులను హేళన చేసేలా మాట్లాడారని బండి సంజయ్ ఆరోపించారు. ఆ వ్యాఖ్యలపై ఆయనపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.



## షాపింగ్‌కు తీసుకెళ్లలేదని.. కన్నబిడ్డల గొంతు నులిమి తల్లి ఆత్మహత్య

హైదరాబాద్‌లోని బోరబండలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. తమ పెళ్లి రోజున భర్త షాపింగ్‌కు తీసుకెళ్లలేదన్న మనస్తాపంతో ఓ మహిళ తన ఇద్దరు పిల్లల గొంతు నులిమి, ఆపై ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటనలో ఆమె రెండేళ్ల కుమార్తె ప్రాణాపాయ స్థితిలో ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. కుటుంబ కలహాలే ఈ దారుణానికి కారణమని పోలీసులు ప్రాథమికంగా భావిస్తున్నారు. వివరాల్లోకి వెళితే.. బోరబండ పెద్దమ్మనగర్‌లో నివసించే మురళి వేణు, సత్యవేణి (30) దంపతులకు కుమారుడు రుద్రాన్ష్ (5), కుమార్తె ధన్విక (2) ఉన్నారు. భర్త మురళి విద్యుత్ శాఖలో లైన్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. శుక్రవారం వారి పెళ్లి రోజు కావడంతో షాపింగ్‌కు వెళ్దామని సత్యవేణి భర్తను కోరింది. అయితే, కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్న తన తండ్రిని డయాలసిస్ కోసం ఆసుపత్రికి తీసుకెళ్లాలని, మరోరోజు వెళ్దామని మురళి నచ్చజెప్పాడు. ఈ విషయమై ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగినట్లు సమాచారం. భర్త తన తండ్రిని తీసుకుని ఆసుపత్రికి వెళ్లిన తర్వాత సత్యవేణి దారుణ నిర్ణయం తీసుకుంది. ఇంట్లోకి వెళ్లి గడియ పెట్టుకుని, టీవీ సౌండ్ పెద్దగా పెట్టింది. అనంతరం పిల్లలిద్దరి గొంతు నులిమి, ఆ తర్వాత తానూ ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. డ్యూటీ ముగించుకుని ఇంటికి వచ్చిన అత్త మంగాదేవి ఎంతసేపటికీ తలుపులు తీయకపోవడంతో కిటికీలోంచి చూడగా, కోడలు ఉరి వేసుకుని కనిపించింది. స్థానికుల సమాచారంతో ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు తలుపులు పగలగొట్టి చూడగా, అప్పటికే సత్యవేణి, కుమారుడు రుద్రాన్ష్ మృతి చెందారు. కొన ఊపిరితో ఉన్న చిన్నారి ధన్వికను వెంటనే నిలోఫర్ ఆసుపత్రికి తరలించారు. సత్యవేణి మృతికి ఆమె భర్త, అత్తమామలే కారణమని మృతురాలి వదిన పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ ఫిర్యాదు ఆధారంగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు.



## బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డి ఫామ్‌హౌస్‌లో డ్రగ్స్ పార్టీ.. కాల్పుల కలకలం!

రంగారెడ్డి జిల్లా మొయినాబాద్‌లోని అజీజ్‌నగర్ ప్రాంతం శనివారం రాత్రి కాల్పుల శబ్దాలతో దద్దరిల్లింది. బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డికి చెందిన బీఎమ్ఆర్ ఫామ్‌హౌస్‌లో నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్న డ్రగ్స్ పార్టీపై పోలీసులు మెరుపు దాడి చేశారు. ఈ క్రమంలో చోటుచేసుకున్న కాల్పుల ఘటన స్థానికంగా కలకలం సృష్టించింది. దీనికి సంబంధించిన పూర్తి వివరాలను చేవెళ్ల డీసీపీ యోగేష్ గౌతమ్ మీడియాకు వివరించారు. ఫామ్‌హౌస్‌లో మద్యం, డ్రగ్స్ పార్టీ జరుగుతోందన్న పక్కా సమాచారంతో శనివారం రాత్రి 9:30 గంటలకు ఈగల్ టీమ్, ఎస్‌వోటీ, స్థానిక పోలీసులు ఏకకాలంలో దాడులు నిర్వహించారు. పోలీసుల రాకను గమనించిన నిందితులు భయాందోళనతో గాలిలోకి ఒక రౌండ్ కాల్పులు జరిపారు. ఢిల్లీకి చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి నమీద్ మిశ్రా ఈ కాల్పులు జరిపినట్లు పోలీసులు గుర్తించారు. ఆ తుపాకీ రితేష్ రెడ్డికి చెందినదిగా ప్రాథమిక విచారణలో తేలింది. ఈ పార్టీలో మొత్తం 10 మంది పాల్గొన్నట్లు పోలీసులు ధ్రువీకరించారు. పట్టుబడిన వారిలో మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డితో పాటు ఏపీలోని ఏలూరు ఎంపీ పుట్టా మహేశ్‌కుమార్ యాదవ్, రియల్ ఎస్టేట్ వ్యాపారులు నమీద్ మిశ్రా, రితేష్ రెడ్డి, రమేశ్, శ్రవణ్ కుమార్, విజయ్ కృష్ణ, కాసిక్ రవి, అర్జున్ రెడ్డి, ఒక మహిళ ఉన్నారు. వీరంతా వీకెండ్ పార్టీ కోసం వివిధ ప్రాంతాల నుంచి ఇక్కడికి చేరుకున్నట్లు సమాచారం. పోలీసులు ఘటనా స్థలంలోనే డ్రగ్ టెస్ట్ కిట్‌లతో పరీక్షలు నిర్వహించగా.. రోహిత్ రెడ్డి, నమీద్ మిశ్రా, రితేష్ రెడ్డి, కాసిక్ రవి, అర్జున్ రెడ్డిలకు పాజిటివ్‌గా తేలింది. తామంతా వారం క్రితమే సిమ్లా, గోవా పర్యటనల నుంచి వచ్చామని, అక్కడే డ్రగ్స్ తీసుకున్నామని పోలీసులకు వాంగ్మూలం ఇచ్చినట్టు తెలిసింది. అయితే పూర్తిస్థాయి నిర్ధారణ కోసం వీరి రక్త నమూనాలను సేకరించి ఎఫ్ఎస్ఎల్ (ఫోరా) ల్యాబ్‌కు పంపినట్లు డీసీపీ తెలిపారు. సోదాల సమయంలో పోలీసులు సుమారు 2 గ్రాముల తెల్లటి పౌడర్‌ను (కొకైన్‌గా అనుమానం) స్వాధీనం చేసుకున్నారు. ఇది డ్రగ్సా కాదా అన్నది పరీక్షల తర్వాత వెల్లడిస్తామని అధికారులు తెలిపారు.

## దొర పాడెను మోసిన పోలీస్ బాస్‌లు.. గౌరవ వందనంతో తుది వీడ్కోలు

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ డీజీపీ హనుమంత జ్యోతి దొర (హెచ్.జె. దొర) అంత్యక్రియలు శనివారం హైదరాబాద్‌లో అధికార లాంఛనాలతో ముగిశాయి. ఈ సందర్భంగా తెలంగాణ డీజీపీ బి.శివధర్ రెడ్డి, హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వి.సి. సజ్జనార్, సైబరాబాద్ కమిషనర్ ఎం. రమేశ్ స్వయంగా ఆయన పాడెను మోసి, తమ గురుభక్తిని, గౌరవాన్ని చాటుకున్నారు. శనివారం మధ్యాహ్నం జూబ్లీహిల్స్‌లోని ఆయన నివాసం నుంచి అంతిమయాత్ర ప్రారంభమైంది. ఈ యాత్రలో పలువురు ప్రస్తుత, మాజీ పోలీస్ అధికారులు, సిబ్బంది, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అంతిమయాత్ర జూబ్లీహిల్స్‌లోని మహాప్రస్థానం వరకు సాగింది. అక్కడ అధికార లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించి దొరకు తుది వీడ్కోలు పలికారు. అంతకుముందు, దొర భౌతికకాయానికి మాజీ మంత్రులు తలసాని శ్రీనివాస్ యాదవ్, దేవేందర్ గౌడ్, లోక్‌సత్తా పార్టీ వ్యవస్థాపకుడు జయప్రకాశ్ నారాయణ, హైదరాబాద్ కలెక్టర్ హరిచందన నివాళులర్పించారు. మాజీ డీజీపీలు జితేందర్, అరవిందరావు, విశ్రాంత ఐపీఎస్ అధికారులు రాజీవ్ త్రివేది, కమలాసన్ రెడ్డి తదితరులు పోలీస్ శాఖకు దొర చేసిన సేవలను స్మరించుకున్నారు. 1965 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన హెచ్.జె. దొర, ఉమ్మడి రాష్ట్రంలో అత్యధిక కాలం డీజీపీగా పనిచేసిన అధికారులలో ఒకరు. నక్సలిజాన్ని కట్టడి చేయడంలో, ఫ్రెండ్లీ పోలీసింగ్ వంటి సంస్కరణలు తీసుకురావడంలో ఆయన కీలక పాత్ర పోషించారు. కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్న 83 ఏళ్ల దొర, శుక్రవారం ఉదయం నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచిన విషయం తెలిసిందే.



## పటేల్ గూడ ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

అమీన్పూర్ : బీరంగూడ డివిజన్ పరిధిలోని పటేల్ గూడ బీహెచ్ఈఎల్ మెట్రో ఎంక్లేవ్ కాలనీలో శనివారం సాయంత్రం ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందు కార్యక్రమానికి పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అల్లా కృపతో ప్రపంచంలో శాంతి నెలకొని.. ప్రజలందరూ సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రార్థించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో అమీన్పూర్ మాజీ ఎంపీపీ దేవానందం, మాజీ జెడ్పిటిసి సుధాకర్ రెడ్డి, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నరసింహ గౌడ్, సీనియర్ నాయకులు ఇక్బాల్, శ్రీకాంత్, యునుస్, ముస్లిం మత పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.



## మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కలిసిన పటాన్చెరు నియోజకవర్గ మార్కెట్ కమిటీ చైర్మన్ శివానందం

వాయిస్ టుడే న్యూస్ పటాన్ చెరు : పటాన్చెరు నియోజకవర్గం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ శివానందం వైస్ చైర్మన్ రాజశేఖర్ మరియు కమిటీ సభ్యులు కాంగ్రెస్ సీనియర్ నాయకులతో కలిసి తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సత్కరించి కృతజ్ఞతలు తెలియజేశారు అనంతరం ఆయన మాట్లాడుతూ పటాన్చెరు నియోజకవర్గ వ్యవసాయ రంగంలో మార్కెట్ యాడ్ సంబంధించిన పనులను వ్యవసాయం కు సంబంధించిన నిధులు ప్రభుత్వం నుంచి మంజూరు చేస్తానని తెలిపారు అనంతరం నూతన మార్కెట్ కమిటీ చైర్మన్ శివానందం వైస్ చైర్మన్ రాజశేఖర్ రెడ్డి మరియు కమిటీ సభ్యులను శుభాకాంక్షలు తెలియజేశారు ఈ కార్యక్రమంలో పటాన్చెరు మండల అధ్యక్షుడు సుధాకర్ గౌడ్ ప్రభాకర్, కృష్ణ ,గోరేమియా, గోపాల్ యాదవ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## శ్రీ లక్ష్మీ అనంత పద్మనాభ స్వామి బ్రహ్మోత్సవాలలో పాల్గొన్న ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

రామచంద్రపురం : ముత్తంగి డివిజన్ పరిధిలోని వెలిమలలో గల శ్రీశ్రీశ్రీ లక్ష్మీ అనంతపద్మనాభ స్వామి బ్రహ్మోత్సవాలలో పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి దర్శించుకున్నారు ప్రజలందరూ సుఖ సంతోషాలతో అష్టైశ్వర్యాలతో ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. అనంతరం ఆలయ నిర్వాహకులు ఎమ్మెల్యే జిఎంఆర్ ను ఘనంగా సన్మానించారు.



## మధు జీ జన్మదిన్ ముబారక్...

**నీలం మధుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన ఏఐసిసి అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే...**

**ఢిల్లీలో ఖర్గే ఆశీస్సులు తీసుకున్న నీలం మధు ముదిరాజ్..**

**బీసీల రాజకీయ అవకాశాలు, సామాజిక స్థితిగతులపై చర్చించిన ఖర్గే..**

**ప్రజల్లోకి పార్టీ కార్యక్రమాలు మరింత బలంగా తీసుకెళ్లండి..**

**కాంగ్రెస్ పార్టీ సపోర్ట్ మీకు ఎల్లవేళలా ఉంటుంది..**

వాయిస్ టుడే న్యూస్ పటాన్ చెరు : మధుజీ జన్మదిన ముబారక్ అంటూ ఏఐసిసి అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి నీలం మధు ముదిరాజ్ కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈనెల 14న తన జన్మదినాన్ని పురస్కరించుకొని గురువారం సాయంత్రం నీలం మధు ముదిరాజ్ ఢిల్లీ రాజాజీ మార్గ్ లోని ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే నివాసంలో ఆయనకు పుష్పగుచ్ఛం ఇచ్చి, శాలువతో సత్కరించి ఆశీస్సులు తీసుకున్నారు. ఈ సందర్భంగా మల్లికార్జున ఖర్గే నీలం మధును ఆప్యాయంగా పలకరించి ఆశీర్వదించారు. బీసీల సంక్షేమం, రాజకీయ అవకాశాలు, సామాజిక స్థితిగతులు, రానున్న రోజుల్లో పార్టీ, ప్రభుత్వ అవకాశాలపై చాలా సేపు ఆయన మాట్లాడారు. తెలంగాణలో రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అద్భుతంగా ప్రజా సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను నిర్వహిస్తుందని కొనియాడారు. ఎప్పటికప్పుడు ప్రజల్లోకి కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాలను విస్తృతంగా తీసుకెళ్తూ ప్రజలతో మమేకం కావాలని ఆయన సూచించారు. కాంగ్రెస్ పార్టీ కోసం కష్టపడ్డ ప్రతి నాయకుడికి పార్టీ మద్దతు ఎల్లవేళలా ఉంటుందని భరోసా ఇచ్చారు. అనంతరం నీలం మధు ఏఐసీసీ అధ్యక్షులు ఖర్గే ఆశీస్సులు తీసుకొని ధన్యవాదాలు తెలిపారు.

# పవన్ కళ్యాణ్ నాయకత్వంలో ప్రజాశక్తిగా ఎదుగుతున్న జనసేన

### - తెలంగాణలో ఘనంగా 13వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

కూకట్‌పల్లి : మార్చి 14(వాయిస్ టుడే ): తెలంగాణ రాష్ట్రంలో జనసేన పార్టీ 13వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈరోజు కెపిహెచ్‌బి కాలనీ 5వ ఫేజ్‌లోని రాష్ట్ర జనసేన పార్టీ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, వీర మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జనసేన పార్టీ జనరల్ సెక్రెటరీ తాళ్లూరి రాము, ప్రచార కమిటీ కార్యదర్శి ఆర్కే సాగర్, రాష్ట్ర నేతలు రాధారం రాజలింగం, సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కోఆర్డినేటర్ ముమ్మారెడ్డి ప్రేమ్ కుమార్ హాజరయ్యారు. వారు పార్టీ జెండాను ఆవిష్కరించి, కేక్ కట్ చేసి స్వీట్స్ పంచుతూ ఆవిర్భావ దినోత్సవాన్ని జరుపుకున్నారు.

ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమ స్ఫూర్తితో 2014లో పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ నాయకత్వంలో జనసేన పార్టీ స్థాపించబడిందని తెలిపారు. ప్రజల సమస్యల పరిష్కారం కోసం, పారదర్శకమైన రాజకీయాలు అందించేందుకు పవన్ కళ్యాణ్ ముందుకు సాగుతున్నారని పేర్కొన్నారు. ప్రజల ఆకాంక్షలకు



అనుగుణంగా జనసేన పార్టీ దేశవ్యాప్తంగా విశ్వాసాన్ని సంపాదించుకుంటోందని, యువత, మహిళలు పెద్ద సంఖ్యలో పార్టీలో చేరుతున్నారని అన్నారు. రాబోయే రోజుల్లో తెలంగాణలో కూడా జనసేన పార్టీ బలంగా ఎదిగి ప్రజల ఆశలను నెరవేర్చే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే దిశగా ముందుకు వెళుతుందని వారు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ జిల్లాల నుండి వచ్చిన జనసేన నాయకులు, గ్రేటర్ హైదరాబాద్ మరియు సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని డివిజన్ నాయకులు, వీర



మహిళలు, పార్టీ కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



## శ్రీనిధి ఒలంపియాడ్ స్కూల్ వారి ఆధ్వర్యంలో గ్రాడ్యుయేషన్ డే

జూబ్లీహిల్స్ 14 మార్చ్ (వాయిస్ టుడే ): వెంగల్ రావు నగర్ డివిజన్ లో మధురానగర్ కమిటీ హాల్లో శ్రీనిధి ఒలంపియాడ్ స్కూల్ వారి ఆధ్వర్యంలో గ్రాడ్యుయేషన్ డే (Graduation Day) నిర్వహించారు.. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే వి నవీన్ యాదవ్.. విద్యార్థులు తమ చదువును ఒక స్థాయి వరకు పూర్తి చేసిన సందర్భంగా జరుపుకునే ప్రత్యేక వేడుక. ఇది స్కూల్, కిండర్‌గార్టెన్ స్థాయిలో కూడా నిర్వహిస్తారు. విద్యార్థులు గ్రాడ్యుయేషన్ గౌన్ మరియు క్యాప్ ధరించి కార్యక్రమంలో పాల్గొంటారు. విద్యార్థులకు సర్టిఫికెట్లు.. మెమెంటోలు అందజేచారు. జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే విద్యార్థులను అభినందిచారు. విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు (డాన్స్, సాంగ్స్) ప్రదర్శిస్తారు. తల్లిదండ్రులు మరియు ఉపాధ్యాయులు కలిసి ఈ విజయాన్ని జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో చిన్నారులు గ్రాడ్యుయేషన్ గౌన్ ధరించి సర్టిఫికెట్లు అందుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులు జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్. నాగార్జున రెడ్డి..లక్ష్మణ్.. నల్లపాటి వెంకటేశ్వరరావు చైర్మన్ -- శ్రీ సాయి రామ్ ఉన్నత పాఠశాలలు శ్రీనిధి గ్లోబల్ స్కూల్స్ ఢిల్లీ వరల్డ్ స్కూల్స్ తెలంగాణ. ఆంధ్ర కర్ణాటక విశిష్ట అతిథులు RSMA -- గుర్తింపు పొందిన పాఠశాలల నిర్వహణ సంఘం కరస్పాండెంట్లు ఢ ప్రిన్సిపాల్స్ ప్రత్యేక అతిది మంగళారపు లక్ష్మణ్ చైర్మన్ -- సంస్కృతి ఉన్నత పాఠశాలలు, కొండపూర్ ఇతరులు పాల్గున్నారు.

## ఐటీ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబును మర్యాదపూర్వకంగా కలిసిన పల్లపు సురేందర్



శేరిలింగంపల్లి, మార్చి 14 (వాయిస్ టుడే): నల్లగండ్ల డివిజన్‌కు చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు పల్లపు సురేందర్ తెలంగాణ రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నల్లగండ్ల డివిజన్ పరిధిలో కొనసాగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజలు ఎదుర్కొంటున్న స్థానిక సమస్యలు మరియు మౌలిక వసతుల అభివృద్ధికి సంబంధించిన అంశాలను మంత్రి దృష్టికి తీసుకెళ్లి వివరించారు. ప్రజలకు అవసరమైన రోడ్లు, డ్రైనేజ్, తాగునీటి సదుపాయాలు వంటి సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. అలాగే డివిజన్ అభివృద్ధికి అవసరమైన పలు ప్రతిపాదనలను కూడా మంత్రి ముందు ఉంచినట్లు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, ప్రజా సేవలో మరింత విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రాజు నాయక్, హనుమత్, రాజు, వేణు, చింటూ, సాయి, గంగారాం తదితరులు పాల్గొన్నారు.

## మహిళల ఆర్థిక సాధికారతే లక్ష్యం

### – వసంతనగర్‌లో 'ఇవానియా బ్యూటీ పార్లర్' ప్రారంభించిన మంత్రి శ్రీధర్ బాబు, బండి రమేష్



కూకట్‌పల్లి: మార్చి 14(వాయిస్ టుడే ): రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలన్న లక్ష్యంతో పలు సంక్షేమ, స్వయం ఉపాధి పథకాలను రూపొందిస్తున్నారని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు గారు పేర్కొన్నారు. కూకట్‌పల్లి నియోజకవర్గ పరిధిలోని వసంత నగర్‌లో శ్రీవాణి అనే మహిళ నూతనంగా ఏర్పాటు చేసిన 'ఇవానియా బ్యూటీ పార్లర్' ను ఆయన టిపిసిసి ఉపాధ్యక్షుడు, కూకట్‌పల్లి నియోజకవర్గం ఇంచార్జ్ బండి రమేష్ గారితో కలిసి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ మహిళలు తమకు తామే అవకాశాలను సృష్టించుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని సూచించారు. సంకల్పం, దీక్ష, పట్టుదల ఉంటే మహిళలు ఏ లక్ష్యాన్నైనా సాధించగలరని అన్నారు. శిక్షణ పొందిన మహిళలు స్వయం ఉపాధిని సాధించి ఆర్థికంగా నిలదొక్కుకుంటున్నారని తెలిపారు.

టీజీఐఐసీ చైర్మన్ శ్రీమతి నిర్మల జగ్గారెడ్డి గారు మాట్లాడుతూ ఎంత పెద్ద ప్రయాణమైనా చిన్న అడుగుతోనే ప్రారంభమవుతుందని అన్నారు. శ్రీవాణి మరిన్ని బ్యూటీ పార్లర్లను ఏర్పాటు చేసి వ్యాపారంలో మరింత అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. టిపిసిసి ఉపాధ్యక్షుడు బండి రమేష్ గారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు స్వయం సహాయక సంఘాలను బలోపేతం చేసి వాటి ద్వారా మహిళలు ఆర్థికంగా ఎదిగేలా చర్యలు తీసుకుంటున్నారని అన్నారు. గతంలో పెట్రోల్ బంకు ఏర్పాటు చేయాలంటే కోటీశ్వరులకు మాత్రమే సాధ్యమని, ఇప్పుడు స్వయం సహాయక సంఘాల ద్వారా మధ్యతరగతి మహిళలు కూడా పెట్రోల్ బంకులు స్థాపించే స్థాయికి చేరుకుంటున్నారని తెలిపారు. ఆర్టీసీకి అద్దెకు ఇచ్చే బస్సులు సైతం మహిళలే కొనుగోలు చేసేలా ప్రభుత్వం ప్రోత్సహిస్తోందన్నారు. బ్యూటీ పార్లర్ నిర్వాహకురాలు శ్రీవాణిని ఈ సందర్భంగా నాయకులు అభినందించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కూన శ్రీశైలం గౌడ్, సత్యం శ్రీరంగం, గాలి బాలాజీ, శేరి సతీష్ రెడ్డి, గొట్టిముక్కల వెంకటేశ్వరరావు, కొప్పిశెట్టి దినేష్, గంధం రాజు, సాయి బాబు చౌదరి, సుజాత, వాణి, లల్లి కాంత్, సంధ్య, రజిత, రంగా మోహన్, రేష్మ, శివ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

# మూసీ తరహాలో మంజీరా నదిని కూడా రక్షించాలి

### - ప్రత్యేక పరిరక్షణ బోర్డు ఏర్పాటు చేయాలి : మెట్టు శ్రీధర్

పటాన్ చెరు (వాయిస్ టుడే న్యూస్) : తెలంగాణ యువజన సంఘాల సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మెట్టు శ్రీధర్ మాట్లాడుతూ, హైదరాబాద్‌లోని మూసీ నది ప్రక్షాళన మరియు సుందరీకరణ కోసం ప్రభుత్వం చేపడుతున్న చర్యలు అభినందనీయమని పేర్కొన్నారు. అదే స్థాయిలో ఉమ్మడి మెదక్ జిల్లా ప్రజల జీవనాధారమైన మంజీరా నదిని కూడా కాలుష్యం బారినుండి రక్షించేందుకు ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

గోదావరి ఉపనది అయిన మంజీరా నది ఉమ్మడి మెదక్ జిల్లాలో లక్షలాది మంది ప్రజలకు సాగు మరియు తాగునీటి ప్రధాన ఆధారంగా ఉందని తెలిపారు భావితరాలకు సాగు మరియు తాగునీటికి ఉపయోగపడే మంజీరా నదిని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంతో పాటు ప్రతి పౌరుడిపై ఉందని ఆయన పేర్కొన్నారు.

హైదరాబాద్ నగరంలోని నాలాల ద్వారా వచ్చే మురుగు నీరు మరియు పారిశ్రామిక సంస్థలు విడుదల చేసే రసాయన వ్యర్థాలు నక్కవాగు ద్వారా ఇస్మాయిల్ ఖాన్‌పేట్ పరిసర ప్రాంతాల్లో మంజీరా నదిలో కలుస్తున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కలుషిత నీరు చివరకు కామారెడ్డి జిల్లా పరిధిలోని నిజాం సాగర్‌లోకి చేరుతుందని, ఈ పరిస్థితి కొనసాగితే మంజీరా నది భవిష్యత్తు ప్రశ్నార్థకమవుతుందని హెచ్చరించారు. హైదరాబాద్‌లోని చెరువులు, కుంటలను రక్షించేందుకు ప్రభుత్వం ప్రత్యేక సంస్థలను ఏర్పాటు చేసి చర్యలు తీసుకుంటున్నప్పటికీ, హైదరాబాద్‌కు సమీపంలోనే ఉండి వేలాది ఎకరాలకు సాగునీరు మరియు లక్షలాది ప్రజలకు తాగునీరు అందిస్తున్న మంజీరా నది



కాలుష్య సమస్యపై కూడా ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. అదేవిధంగా, కాలుష్య ప్రభావిత ప్రాంతాల ప్రజల కోసం గతంలో పటాన్‌చెరులో నిర్మించిన సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ఇప్పటికీ పూర్తిస్థాయిలో ప్రారంభం కాకపోవడం పట్ల ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. కేవలం భవనాలు నిర్మించడం సరిపోదని, కాలుష్య బాధితులకు తక్షణమే పూర్తి స్థాయి వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావాలని ఆయన డిమాండ్ చేశారు.

భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 ప్రకారం ప్రతి పౌరుడికి జీవించే హక్కుతో పాటు స్వచ్ఛమైన పర్యావరణం పొందే హక్కు కూడా ఉందని గుర్తు చేశారు. అలాగే నీటి కాలుష్య నివారణ చట్టం--1974ను కఠినంగా అమలు చేయడంలో అధికారులు విఫలమవుతున్నారని ఆయన అన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి మూసీ నది తరహాలోనే మంజీరా నది పరిరక్షణ కోసం ప్రత్యేక బోర్డు ఏర్పాటు చేయాలని, లేదంటే మరోసారి గ్రీన్ ట్రిబ్యునల్‌ను ఆశ్రయించడానికి వెనుకాడనని మెట్టు శ్రీధర్ హెచ్చరించారు. మంజీరా నదిని కాలుష్యం బారినుండి రక్షించుకోవడం ప్రభుత్వంతో పాటు ఉమ్మడి మెదక్ జిల్లా ప్రజలందరి బాధ్యత అని ఆయన పిలుపునిచ్చారు.





# బండి.... జగమొండి

**11 గంటల్లో 40 కి.మీలు నడిచేనండి**

**మండుటెండను సైతం లెక్క చేయకుండా కొండగట్టుకు చేరిన బండి.**

**మధ్యాహ్న భోజనం వద్ద ఒకసారి, తేనెటీగ దాడి సమీపంలో మరోసారి కొద్దిసేపు సేద దీరిన కేంద్ర మంత్రి**

**సంజయ్ తో కలిసి అడుగులో అడుగు వేస్తూ నడిచిన కాషాయ శ్రేణులు**

**దిగ్విజయంగా ముగిసిన "అంజన్న ఆశీర్వాద యాత్ర**

**కరీంనగర్ నుండి కొండగట్టు దాకా కాషాయ శ్రేణుల సందడి**



కరీంనగర్,మార్చి14(వాయిస్ టుడే); "అంజన్న ఆశీర్వాద యాత్ర" పేరుతో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ బీజేపీ ప్రజాప్రతినిధులతో చేపట్టిన ఒకరోజు పాదయాత్ర దిగ్విజయంగా ముగిసింది. మున్సిపల్ ఎన్నికల్లో కరీంనగర్ మేయర్ పీఠాన్ని అప్పగిస్తే తన పార్లమెంట్ పరిధిలో ఎన్నికైన బీజేపీ ప్రజాప్రతినిధులందరితో కలిసి కొండగట్టు అంజన్న సన్నిధికి కాలినడకన వచ్చి మొక్కులు చెల్లించుకుంటానంటూ ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నారు.11 గంటల్లో ఏకబిగిన దాదాపు 40 కిలోమీటర్ల మేర నడిచి కొండగట్టుకు చేరుకున్నారు దాదాపు 40 డిగ్రీల మండుటెండను సైతం లెక్క చేయకుండా,మధ్యలో చిన్న అవాంతరాలు ఎదురైనా,తేనెటీగలు హంగామా సృష్టించినా అదరకుండా బెదరకుండా అన్నీ అధిగమిస్తూ అంజన్న ఆలయ సన్నిధికి చేరుకున్నారు.కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో నూతనంగా ఎన్నికైన వార్డు సభ్యులు,ఉప సర్పంచులు, సర్పంచులు,కౌన్సిలర్లు, కార్పొరేటర్లు, డిప్యూటీ మేయర్,మేయర్ తో కలిసి అంజన్న ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు.పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లో బిజీగా ఉన్న కేంద్ర మంత్రి బండి సంజయ్ శుక్రవారం సాయంత్రం 7.30 గంటలకు ఢిల్లీ నుండి బయలుదేరి అర్ధ రాత్రి 1.30 గంటలకు కరీంనగర్ కు చేరుకున్నారు. మరుసటి ఉదయం 6 గంటలకే లేని రడీ అయ్యి 7 గంటలకే కరీంనగర్ మహాశక్తి ఆలయం వద్దకు చేరుకున్నారు. అమ్మవారి ఆలయంలో పూజలు నిర్వహించారు.అక్కడి నుండే అంజన్న ఆశీర్వాద యాత్రను ప్రారంభిస్తున్న మీడియాతో మాట్లాడారు. అక్కడికి చేరుకున్న నూతనంగా ఎన్నికైన బీజేపీ సర్పంచులు 108 మంది, 450 మంది వార్డు సభ్యులు,54 మంది కార్పొరేటర్లు, కౌన్సిలర్లతోపాటు వేలాది మంది కాషాయ శ్రేణులతో కలిసి కాలినడకన బయలుదేరారు. రాజకీయాలకు అతీతంగా చేపట్టిన ఆధ్యాత్మిక యాత్ర కావడంతో బండి సంజయ్ పాదయాత్రలో బూట్లు వేసుకోలేదు. సన్నిహితులు ఎంత ఒత్తిడి చేసినా బూట్లు వేసుకునేందుకు ససేమిరా అన్నారు. కేవలం సాక్సులతోనే నడక ఆరంభించారు. మండుటెండలో తారు రోడ్డుపై చెప్పులు లేకుండా కొద్దిదూరం నడవాలంటేనే ఇబ్బందిగా ఉంటుంది. కానీ అవేవీ లేకుండా వట్టి సాక్సులతోనే ఏకంగా 40 కి.మీల మేరకు బండి సంజయ్ నడవడం అందరినీ విస్మయానికి గురి చేసింది. ఈరోజే టెన్త్ పరీక్షలు ప్రారంభం కావడం, 9.30 గంటలకే టెన్త్ పరీక్ష ఆరంభం కావడం.అదే సమయంలో బండి సంజయ్ చేపట్టిన పాదయాత్ర కరీంనగర్ జగిత్యాల హైవేపైకి రావడంతో ట్రాఫిక్ జాం అవుతుందనే ఆందోళన కన్పించింది.కానీ బండి సంజయ్ వేలాది మంది కాషాయ దండుతో హైవేకు ఒకవైపు మాత్రమే. క్రమశిక్షణతో అటు పాదయాత్ర రక్షక దళం, ఇటు పోలీసుల సాయంతో విద్యార్థులకు ఇబ్బంది లేకుండా పాదయాత్రను కొనసాగించడం విశేషం.ఈ విషయంలో పోలీసులకు పూర్తిగా సహకరించాలని,ఏ ఒక్క విద్యార్థికి ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకోవాలని పదేపదే బండి సంజయ్ కోరడం గమనార్హం. ఫలితంగా విద్యార్థులకు, వాహనదారులకు పెద్దగా ఇబ్బంది లేకుండా హైవేపై సాఫీగా పాదయాత్ర సాగింది.అసలే ఎండా కాలం 40 డిగ్రీల దాకా ఎండ.మధ్యాహ్నం చెమటలు కక్కుతున్నా లెక్క చేయకుండా బండి సంజయ్ జోష్ తో నడవటం చూసి కాషాయ శ్రేణులంతా మేము సైతం అంటూ అడుగులో అడుగు వేసుకుంటూ కదం తొక్కారు. రామడుగు మండలం కోన్ రావుపేట వద్దకు రాగానే.. అక్కడ భారీ ఎత్తున జనం రావడం.భారీ ఎత్తున డీజే సౌండ్ తో కోలాహలం నెలకొనడం ఆ జోష్ లో కొందరు కార్యకర్తలు డ్రోన్ ఎగరేయడం... అక్కడే చెట్టుపైనున్న తెనేతుట్టె కదిలి అందులోనుండి తేనెటీగలు బయటకు రావడంతో కాసేపు గందరగోళం నెలకొంది. తేనెటీగల దాడిలో ముగ్గురు కార్పొరేటర్లు, మరో ముగ్గురు కాషాయ శ్రేణులు గాయపడ్డారు. వీరిని హుటాహుటిన ఆసుపత్రికి తరలించి చికిత్స ఇప్పించారు.అయితే కేంద్ర మంత్రి బండి సంజయ్ మాత్రం తేనెటీగల దాడి చేయకుండా అప్రమత్తమయ్యారు. కాసేపు రోడ్డు పక్కనే ఉన్న బెంచిపై ఆగి సేదదీరారు. పాదయాత్ర సందర్భంగా ఏర్పాటు చేసిన అంబులెన్సులో ఉన్న డాక్టర్లు వచ్చి బండి సంజయ్ ను రోటీన్ హెల్త్ చెకప్ చేశారు.కొద్ది నిమిషాల తరువాత అంతా సద్దుమణగడంతో మళ్లీ బండి సంజయ్ తన పాదయాత్రను యాధావిధిగా కొనసాగించారు.రామడుగు మండలం కోన్ రావుపేట నుండి బయలుదేరిన పాదయాత్ర కురిక్యాల మీదుగా మధ్యాహ్నం 3.30 గంటలకు గంగాధర మండల కేంద్రానికి చేరుకున్నారు. అక్కడ స్థానిక వీఏఎస్ ఫంక్షన్ హాలులో బీజేపీ శ్రేణులందరికీ మధ్యాహ్న భోజన ఏర్పాట్లు చేశారు. బండి సంజయ్ సైతం అక్కడే ఓ కార్యకర్త ఇంట్లో మధ్యాహ్న భోజనం చేసి కాసేపు సేద దీరారు. సాయంత్రం 5.30 గంటలకు తిరిగి పాదయాత్రను ప్రారంభించిన బండి సంజయ్ వెంకటాయపల్లి, పూడూరు మీదుగా కొండగట్టుకు చేరుకున్నారు. సాయంత్రం 7 గంటలకు దొంగలమర్రి ఎక్స్ రోడ్ వద్దకు చేరుకున్నారు. దొంగల మర్రి నుండి రాత్రి 7.30 గంటల వరకు కొండగట్టు అంజన్న ఆలయం వద్దకు చేరుకుని "అంజన్న ఆశీర్వాద యాత్ర"ను దిగ్విజయంగా ముగించనున్నారు. అనంతరం బీజేపీ ప్రజాప్రతినిధులతో కలిసి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ఇచ్చిన మాట ప్రకారం ఆంజనేయస్వామికి మొక్కులు చెల్లించుకున్నారు.



## రంజాన్ పండుగ సందర్భంగా.. మహిళలకు నిత్యవసర సరుకులు, చీరలు పంపిణీ

హైదరాబాద్, మార్చి 14: రంజాన్ పండుగ సందర్భంగా.. అన్వర్ ఉల్ ఉలూశీ ఇన్ స్టిట్యూషన్స్ సెక్రటరీ నవాబ్ మహబూబ్ అలంఖాన్ ఆధ్వర్యంలో అంబర్ పేట ఏకే ప్లాజా ఫంక్షన్ హాల్ లో శనివారం మహిళలకు నిత్యవసర సరుకులు, చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా టిపిసిసి ఉపాధ్యక్షులు, మెదక్ పార్లమెంట్ నియోజకవర్గ ఇంచార్జ్ నవాబ్ ముజాహిద్ అలంఖాన్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ.. మైనారిటీ సోదర సోదరీమణులకు రంజాన్ శుభాకాంక్షలు తెలియజేసారు. ప్రతి సంవత్సరం రంజాన్ పండుగ సందర్భంగా మైనారిటీ సోదరీమణులకు ఈ రంజాన్ కిట్లు అందించడం మాకు గొప్ప సంతోషాన్ని కలిగిస్తుందన్నారు. రంజాన్ మాసం శాంతి సహనం సేవ భావాలకు ప్రతీకగా నిలుస్తుందన్నారు. సమాజంలో సామరస్యం పెంపొందించడంలో ఇలాంటి సేవ కార్యక్రమాలు ముఖ్యపాత్ర పోషిస్తుందన్నారు.

## ప్రజా ప్రభుత్వం వచ్చిన తరువాత సీఎం రేవంత్ రెడ్డి అన్ని వర్గాలకు సమన్యాయం చేసే దిశగా కృషి చేస్తున్నాడు

**మహిళా బిల్లులో బీసీ మహిళలకు సబ్ కోట కల్పించాలి**

**బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం**



హైదరాబాద్, మార్చి 14: మహిళా బిల్లులో బీసీ మహిళలకు సబ్ కోట కల్పించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం డిమాండ్ చేశారు. బీసీల హక్కుల సాధనకు ఈ నెల 30,31 తేదీల్లో జరిగే చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. శనివారం కాచిగూడ లో ఆయన మాట్లాడుతూ... చట్ట సభలలో అన్ని వర్గాల మహిళలకు జనాభా దామాషా ప్రకారం రాజకీయ వాటా కల్పించే వరకు మహిళలు సంఘటితంగా పోరాటం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. మహిళలు చేసే పోరాటానికి బీసీ సంక్షేమ సంఘం పూర్తి మద్దతు ఉంటుందని ఆయన తెలిపారు. చట్ట సభలలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ పార్లమెంట్ లో బిల్లును ఆమోదించిన ప్రభుత్వం అన్ని వర్గాల మహిళలకు అందులో వాటా కల్పించకపోవడం చాలా అన్యాయమని అన్నారు. మహిళా బిల్లు బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ మహిళలకు జనాభా దామాషా ప్రకారం సబ్ కోట కల్పించినప్పుడే మహిళా బిల్లుకు సంపూర్ణ సాధికారత లభిస్తుందని గుజ్జ సత్యం అన్నారు.

## కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల సమాఖ్య ఉపాధ్యక్షులుగా ఎంబి విజయ్ కుమార్ యాదవ్



హైదరాబాద్, మార్చి 14: కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల సమాఖ్య ఉపాధ్యక్షులుగా ఎంబి విజయ్ కుమార్ యాదవ్ నియమితులయ్యారు. విజయ్ కుమార్ యాదవ్ నియామకాన్ని ఉద్యోగుల సమాఖ్య జాతీయ అధ్యక్షులు ఎం. రాఘవయ్య, ప్రధానకార్యదర్శి ఎన్ఎస్ పిళ్లై నిర్ధారించారు. ఐఎన్ టియుసి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల చీఫ్ వైస్ ప్రెసిడెంట్ గా విజయ్ కుమార్ యాదవ్ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. నేషనల్ సేఫ్టీ కౌన్సిల్ గవర్నింగ్ బాడీ సభ్యుడిగా సేవలందిస్తూ కార్మికుల సంక్షేమం, భద్రత కోసం ఆయన కృషి చేస్తున్నారు. ఈ సందర్భంగా శనివారం నారాయణగూడ లోని ఐఎన్ టియుసి కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల సమాఖ్యలో అనుభవజ్ఞులైన నాయకులను నాయకత్వంలో చేర్చడం ద్వారా సంస్థ మరింత బలోపేతం అవుతుందని అన్నారు. దేశ వ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఇది దోహదపడుతుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎం.రాఘవయ్యకు, ఎన్ఎస్ పిళ్లైకి ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు.

## ఐవాస్ "స్కిల్ షేర్ - డిస్కవర్, డెవలప్, మాస్టర్" ప్రారంభం



హనుమకొండ, మార్చి 14: హనుమకొండ శ్రీనగర్ కాలనీ ప్రధాన రోడ్ లోని బ్లూ డార్ట్ పైన డైరెక్టర్ అఖిలేష్ యశ్వంత్ దంపతుల ఆధ్వర్యంలో శనివారం ఐవాస్ స్కిల్ షేర్ -- డిస్కవర్, డెవలప్, మాస్టర్ ఘనంగా ప్రారంభమైంది. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ప్రారంభోత్సవ కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో నిర్వహించబడింది. వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు, విద్యార్థులు, యువత, చిన్నారుల తల్లిదండ్రులు, టెక్నాలజీ అభిమానం కలిగిన వారు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా డైరెక్టర్ అఖిలేష్ యశ్వంత్ దంపతులు మాట్లాడుతూ..ప్రపంచవ్యాప్తంగా ఏI టెక్నాలజీ వేగంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో చిన్నారులు, విద్యార్థులు కూడా ఆ దిశగా ముందుకు సాగాలని సూచించారు. ఐవాస్ స్కిల్ షేర్ వంటి సంస్థలు చిన్నారుల్లో ప్రతిభను వెలికితీసి, వారిని గ్లోబల్ స్థాయిలో పోటీ పడేలా తయారుచేయడంలో కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. ట్రైసిటీ ప్రజలు ఇవాష్ స్కిల్స్ షేర్ సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ఆకినపల్లి వీరభద్రయ్య, శ్రీనగర్ కాలనీ అపార్ట్మెంట్ అధ్యక్ష, కార్యదర్శులు, చిన్నారుల తల్లిదండ్రులు, నాయకులు, తదితరులు, పాల్గొన్నారు.

## ఆర్ఎంపి పిఎంపి వెల్ఫేర్ సొసైటీ సమావేశాన్ని జయప్రదం చేయండి



తొర్రూరు , మార్చి 14 వాయిస్ టుడే : పాలకుర్తి నియోజకవర్గ కేంద్రంలో ఆర్.ఎం.పి.ఎం.పి వెల్ఫేర్ అసోసియేషన్ నియోజకవర్గస్థాయి సమావేశం మార్చి 22 న నిర్వహించడం జరుగుతుందని ఇందులో ఆరు మండలాల అధ్యక్ష కార్యదర్శులు వర్కింగ్ ప్రెసిడెంట్లు పాల్గొని జయప్రదం చేయాలని ఆర్ఎంపి పి.ఎం.పి వెల్ఫేర్ అసోసియేషన్ పాలకుర్తి నియోజకవర్గం వర్కింగ్ ప్రెసిడెంట్ సింగారపు భీమయ్య పిలుపునిచ్చారు. శనివారం తొర్రూరు డివిజన్ కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆర్.ఎం.పి పిఎంపి వెల్ఫేర్ అసోసియేషన్ నియోజకవర్గ స్థాయి సమావేశంలో గ్రామీణ వైద్యుల సమస్యల పరిష్కారం కోసం ఏం చేయాలని కార్యాచరణ సిద్ధం చేయడం జరుగుతుందని ఆరు మండలాల నుండి వచ్చిన ప్రతినిధులు ఏ ఏ సమస్యలు ఉన్నాయో చర్చించే అవకాశం ఉంటుందని ప్రతి ఒక్కరూ హాజరై రాబోయే రోజుల్లో కార్యాచరణకు ఏ ఏ అంశాలపై ముందుకు సాగాలని సూచిస్తే మంచిదని ఆయన కోరారు. గ్రామీణ వైద్యులందరూ సంఘాలకు అతీతంగా సంఘటితంగా ఉండి తమ హక్కులను సాధించుకునేందుకు ఉద్యమాల కైనా సిద్ధం కావాలని కోరారు.

## కేయూ మాజీ వైస్ ఛాన్సలర్ లింగమూర్తి మృతి

**నివాళులర్పించిన ఎమ్మెల్యే కే.ఆర్ నాగరాజు**



హనుమకొండ,వాయిస్ టుడే: హన్మకొండ కాకతీయ విశ్వ విద్యాలయం మాజీ వైస్ ఛాన్సలర్ లింగమూర్తి శనివారం అనారోగ్యంతో కన్నుమూశారు. విషయం తెలుసుకున్న వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు హనుమకొండ భీమారం లోని బ్యాంకు కాలనీలో గల మాజీ వైస్ ఛాన్సలర్ నివాసానికి వెళ్లి భౌతిక దేహానికి పూలమాల వేసి నివాళులర్పించి వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. మాజీ వైస్ ఛాన్సలర్ కుటుంబాన్ని పరామర్శించిన వారిలో స్థానిక కాంగ్రెస్ నాయకులు గడ్డం శివరాం ప్రసాద్,కాంగ్రెస్ నాయకులు చిర్ర రాము,చింత రమేష్,కేయూ వీసీ మెంబర్ చిర్ర రాజు,ఎస్డీఎల్సీఈ మాజీ డైరెక్టర్ దినేష్ తో పాటు తదితరులు పాల్గొన్నారు.



## రూ. 69 లక్షలతో రాచాపూర్ గ్రామంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి

నిర్మల్ జిల్లా ప్రతినిధి వాయిస్ టుడే మార్చ్ 14: లక్ష్మణ్ చందా మండలం రాచాపూర్ గ్రామంలో రూ.20 లక్షలతో రెండు స్ హెడ్ జి (వి ఓ) భవనాల నిర్మాణానికి, రూ. 20 లక్షలతో రెండు స్ హెడ్ జి( విఓ) వర్కింగ్ షెడ్ ల నిర్మాణానికి, రూ.24 లక్షలతో రెండు అంగన్వాడీ భవనాల నిర్మాణానికి, 5 లక్షలతో ముదిరాజ్ సంఘ భవన నిర్మాణానికి బీజేఎల్పీ నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నల్ల ఇంద్రకరణ్ రెడ్డి, సీనియర్ నాయకులు రావుల రాంనాథ్, మండల అధ్యక్షులు చిన్నయ్య, గ్రామ సర్పంచ్ మహేష్, మండల బీజేపీ నాయకులు అడ్వాల రమేష్, ముత్యం రెడ్డి, మాజీ ఎంపీటీసీ పోశెట్టి, పోశెట్టి, సురేష్, ప్రవీణ్, నవీన్, రాజేశ్వర్, రామన్న, రవి, తో పాటు తదితరులు పాల్గొన్నారు.

## పదో తరగతి పరీక్ష కేంద్రాల్లో తనిఖీలు కలెక్టర్



నిర్మల్ జిల్లా ప్రతినిధి వాయిస్ టుడే మార్చ్ 14: నిర్మల్ జిల్లా పదవ తరగతి పరీక్ష కేంద్రాలను శనివారం జిల్లా ఉన్నదా అధికారులు విస్తృతంగా తనిఖీలు చేశారు. కలెక్టర్ సోమవార్ పేట్ బాలికల పాఠశాలను సందర్శించిన గా ఎస్పీ జానకి మేదా మోడల్ స్కూల్లో తనిఖీలు చేపట్టారు. అదనపు కలెక్టర్ ఖానాపూర్ మామడ స్కూల్ లను డీఈవో సోమార్పేట్ ఇదిగాం సహా తొమ్మిది కేంద్రాలను పరిశీలించారు ఏ సి జి ఈ 8 పాఠశాలలో ఏర్పాటులను పర్యవేక్షించారు అన్నిచోట్ల అధికారులు పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు.

వాయిస్ టుడే
జనగాత్రం - మననేత్రం
హైదరాబాద్
ఆదివారం 15 మార్చి 2026

# పకడ్బందీగా పదో తరగతి పరీక్షల నిర్వహణ

## స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే

కరీంనగర్,మార్చి14(వాయిస్ టుడే):జిల్లాలో పదవ తరగతి పరీక్షలు ప్రశాంతమైన వాతావరణంలో సజావుగా సాగేందుకు అన్ని చర్యలు చేపట్టినట్లు స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే పేర్కొన్నారు. మొదటిరోజు కరీంనగర్లో ఓల్డ్ హై స్కూల్,ధన్గర్ వాడి పాఠశాలలో ఏర్పాటు చేసిన పదవ తరగతి పరీక్షా కేంద్రాలను స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పరీక్షల సరళిని పరిశీలించారు. విధులు నిర్వర్తిస్తున్న అధికారులు సిబ్బందితో మాట్లాడారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పరీక్షలు నిర్వహించాలని సూచించారు. పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులకు అవసరమైన తాగునీరు ప్రథమ చికిత్స మందులు,ఓఆర్ఎస్ ప్యాకెట్లు,మూత్రశాలలు మరుగుదొడ్లు తరగతి గదిలో తగిన వెంటిలేషన్ ఉండేలా చర్యలు



తీసుకోవాలన్నారు. ఎక్కడా ఎలాంటి చిన్న తప్పిదానికి అవకాశం ఇవ్వకుండా విద్యార్థులు ప్రశాంతమైన వాతావరణంలో పరీక్షలు రాసేలా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. విద్యుత్ అంతరాయం కలుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు.

### మున్సిపల్ కమిషనర్ తనిఖీ

సాయి కృష్ణ థియేటర్ సమీపంలో ఎస్సార్ డిజి స్కూల్లో ఏర్పాటు చేసిన పదవ తరగతి పరీక్షా కేంద్రాన్ని కరీంనగర్ నగరపాలక సంస్థ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పరీక్షా నిర్వహణ తీరు తెన్నులను పరిశీలించారు. విధులు నిర్వర్తిస్తున్న అధికారులకు తగిన సూచనలు చేశారు. పదవ తరగతి పరీక్షలు పక్కాగా నిర్వహించాలని ఎక్కడా ఎలాంటి తప్పులు జరగకుండా జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. పరీక్షా కేంద్రాల్లో వసతులపై అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ జరపాలని సూచించారు.



## రాబోయే ఎన్నికల్లో సనాతన హైందవ ధర్మ రక్షణ ఎజెండాతో ముందుకు సాగుతాం

### ప్రజా సమస్యలు,అవినీతి,అక్రమాలపై పోరాటమే జనసేన లక్ష్యం

### జనసేన పార్టీ 13వ ఆవిర్భావ దినోత్సవం వేడుకల్లో బేతి మహేందర్ రెడ్డి పిలుపు

కరీంనగర్,మార్చి 14(వాయిస్ టుడే): తెలంగాణ ప్రజల గుండెల్లో నమ్మకాన్ని, యువతలో పోరాట స్ఫూర్తిని నింపి సమాజ మార్పుతో రాబోయే జమిలీ ఎన్నికల్లో సనాతన హైందవ ధర్మ రక్షణయే ఎజెండాగా ముందుకు సాగుతామని జనసేన పార్టీ కరీంనగర్ పార్లమెంట్ కో-ఆర్డినేటర్ బేతి మహేందర్ రెడ్డి జనసేన పార్టీ 13వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పిలుపునిచ్చారు.నగరంలోని వావిలాలపల్లి గుండ్ల హనుమాన్ దేవాలయం దగ్గర జనసేన పార్టీ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. ఈ సందర్భంగా బేతి మహేందర్ రెడ్డి మాట్లాడుతూ జనసేన పార్టీ 2014 సంవత్సరంలో మార్చ్ 14వ తేదీన పార్టీని పవన్ కళ్యాణ్ స్థాపించడం జరిగిందని,ఎన్ని అవమానాలు, ఇబ్బందులు,సమస్యలు ఎదురైనా మొక్కవోని దీక్షతో పార్టీని బలోపేతం చేస్తూ ముందుకు సాగుతూ నేడు జనసేన పార్టీ అంటే ప్రజల్లో ఒక నమ్మకం, విశ్వాసం పెరిగిందని,దానికి పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ ఎంతో కష్టపడ్డారని బేతి మహేందర్ రెడ్డి తెలిపారు.ప్రధాని నరేంద్ర మోదీకి అత్యంత సన్నిహితులుగా, దేశం హితం కోసం,సనాతన హైందవ ధర్మ రక్షణ కోసం పార్టీ ఎజెండాగా తీసుకొని రాబోయే జమిలీ ఎన్నికలకు పార్టీని ప్రతి గడప గడపకు తీసుకెళ్లాలని పవన్ కళ్యాణ్ పిలుపునివ్వడం జరిగిందని,దానిలో భాగంగా పార్టీ ఉద్యమి సభ్యత్వ నమోదు కార్యక్రమం ఈ నెల 17వ తేదీ వరకు కొనసాగుతుందని, ఈ సభ్యత్వాన్ని పవన్ కళ్యాణ్ అభిమానులు, జాతీయవాదులు, హిందూత్వవాదులందరు పార్టీ సభ్యత్వాన్ని తీసుకొని జనసేన పార్టీకి అండగా ఉండాలని బేతి మహేందర్ రెడ్డి కోరారు.మరి ముఖ్యంగా స్థానికంగా ప్రజలు ఎదుర్కుంటున్న సమస్యలపై పోరాటం చేస్తూ, అవినీతి అక్రమాలపై ప్రశ్నిస్తూ ప్రజల పక్షాన నిలబడాలని పవన్ కళ్యాణ్ జన సైనికులకు సూచించారని, దానిలో భాగంగా కరీంనగర్ లో అభివృద్ధి మాటున జరిగిన, జరుగుతున్న అనేక అవినీతి, అక్రమాలపై ప్రశ్నిస్తూ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగడుతామని బేతి మహేందర్ రెడ్డి హెచ్చరించారు.ఈ ఆవిర్భావం దినోత్సవ కార్యక్రమంలో జనసేన నాయకులు కాసర్ల మధుకర్ రెడ్డి, వొడ్నల రాజు,సాధు మధుసూదన్ రెడ్డి,వావిలాల రోహిత్ రెడ్డి,టీ. రవీందర్ రెడ్డి,బేతి సురేందర్,బేతి రాజశేఖర్ రెడ్డి, నలుమాచు శ్రీనివాస్ రెడ్డి,చందు,వావిలాల రామ్ రెడ్డి, సురేష్ రెడ్డి,జగన్నాథ రెడ్డి.శ్రీపాల్, ఉమ్మెంతుల మదవ రెడ్డి పాల్గొన్నారు.




## ఇంటి పన్ను వసూళ్ల లో 100% పూర్తి

### - తెలంగాణ రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలిచిన జమ్మికుంట మున్సిపాలిటీ

### మున్సిపల్ కమిషనర్ యండి ఆయాజ్ ని వారి టీమ్ ను అభినందించిన మున్సిపల్ చైర్మన్ శ్రీ మొలుగు ప్రశాంత్ కుమార్

జమ్మికుంట మార్చి 14 (వాయిస్ టుడే): జమ్మికుంట మున్సిపల్ ఇంటి పన్ను వసూళ్లలో 100% పూర్తి చేసి తెలంగాణ రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలిచిన సందర్భంగా జమ్మికుంట మున్సిపల్ కమిషనర్ యండి ఆయాజ్, మేనేజర్ జి రాజిరెడ్డి, RI భాస్కర్, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్,వాణీ,రాజశేఖర్,వికాస్ మరియు సంబంధిత వార్డు ఆఫీసర్స్ సపోటింగ్ స్టాఫ్ అందరినీ అభినందించి సత్కరించిన మున్సిపల్ చైర్మన్ శ్రీ మొలుగు ప్రశాంత్ కుమార్ (దిలీప్). ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జమ్మికుంట మున్సిపల్ తెలంగాణ రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలవడం కోసం కృషి చేసిన కమిషనర్, మేనేజర్, ఆర్ ఐ సూచనల మేరకు పనిచేసి రాష్ట్రంలో మొదటి స్థానంలో రావడానికి పనిచేసిన అందరికీ ధన్యవాదములు తెలుపుతూ కమిషనర్ యండి ఆయాజ్ లాంటి వారికి ఇక్కడ ఉన్నటువంటి స్టాప్ అన్ని విధాలుగా సహకరించడం వల్ల మనం గమ్యాన్ని చేరగలిగాం కాబట్టి ముందు ముందు మా యొక్క పాలకవర్గానికి కూడా మీరందరూ అదే అంకితభావంతో పనిచేసి జమ్మికుంట మున్సిపల్ అభివృద్ధిలో మీరు భాగస్వాములు కావాలని తెలిపారు. ఇందుకు సహకరించిన పురపాలక పట్టణ ప్రజలకు పుర ప్రముఖులకు, పత్రిక మిత్రులకు మున్సిపల్ కౌన్సిలర్స్ కు ఇందుకు సంబంధించిన ప్రతి ఒక్కరికీ ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు.

## ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా పలు వార్డుల సందర్శన



జమ్మికుంట మార్చి 14 (వాయిస్ టుడే): జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని 1,2 వార్డులలో దుబ్బ మల్లికార్జున స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి మరియు శ్రీ పార్వతి సమేత రాజరాజేశ్వర స్వామి వారి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి 1,2 వార్డును సందర్శించిన మున్సిపల్ చైర్మన్ శ్రీ మొలుగు ప్రశాంత్ కుమార్ (దిలీప్). దుబ్బ మల్లికార్జున స్వామి ఆలయంనికి వెళ్ళే దారి గుంతల మయమైనందని, రోడ్డు మరియు లైట్ సౌకర్యం కావాలని అలాగే రెండు వార్డులకు గాను ప్రధాన సమస్యగా ఎవరైనా వ్యక్తి పరమపదించినట్లైతే దహన సంస్కరణలు నిర్వహించటానికి వైకుంఠదామము ఇబ్బంది గా ఉంది అని, అలాగే రోడ్డు, డ్రైన్ గురించి కూడా ఈ సందర్భంగా చైర్మన్ కు తెలిపారు వార్డు కౌన్సిలర్‌లు మరియు వార్డు ప్రజలు. దానికి సానుకూలంగా స్పందించిన మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ (దిలీప్) అతి త్వరలోనే అన్ని సమస్యలు పరిష్కారం అయ్యేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్స్ పోలు దివ్య బిక్షపతి, పోల్నేనీ శిల్ప వేణుగోపాల్ రావు, ఫాజిల్,సత్యం,చందు,పవన్ తదితరులు పాల్గొన్నారు.



## రైతుల సమస్యల పరిష్కారం కొరకు రైతు ప్రజా సంఘాల కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో ధర్నా

మద్దతు ప్రకటించిన హుజురాబాద్ బీసీ జేఏసీ

హుజురాబాద్ మార్చి 14 (వాయిస్ టుడే): హుజురాబాద్ పట్టణంలోని అంబేద్కర్ కూడలి వద్ద రైతు ప్రజా సంఘాల కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన రైతు ప్రజా సంఘాల నాయకులు ముచ్చె సమ్మిరెడ్డి నిరవధిక నిరాహార దీక్షకు మద్దతుగా హుజురాబాద్ బీసీ జేఏసీ గౌరవ అధ్యక్షుడు చందుపట్ల జనార్ధన్, సందేల వెంకన్న తమ సంఘీభావాన్ని ప్రకటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వము తమ మేనిఫెస్టోలో పొందుపరిచిన విధంగా రైతులకు రైతు భరోసా ను ప్రతి సంవత్సరము వర్షాకాలము, వేసంగి పంటలకు పెట్టుబడి రూపంలో రైతు భరోసా నిధులను మంజూరు చేయవలసి ఉన్నప్పటికీ ఐదు పంటలకు గాను కేవలము రెండే రెండు సార్లు రైతు భరోసా నిధులను రైతులకు మంజూరు చేయడము రాష్ట్ర ప్రభుత్వం యొక్క దమన నీతికి నిదర్శనం అన్నారు. అదేవిధంగా రైతులందరికీ రెండు లక్షల వరకు రుణమాఫీ మంజూరు చేస్తామని హామీ ఇచ్చినప్పటికీ అందరి రైతులకు రుణమాఫీ కాకపోవడం మాత్రమే కాకుండా సన్న వరి ధాన్యానికి సంబంధించి అందరి రైతులకు సబ్సిడీ అంతకపోవడం పట్ల తమ ఆవేదనను వ్యక్తం చేసినారు. దేశానికి వెన్నెముకైనా రైతులు నిర్లక్ష్యం చేయకుండా రాష్ట్ర ప్రభుత్వము తాము ఇచ్చినటువంటి హామీలను వెంటనే అమలు చేయాలని లేనిచో బీసీ జేఏసీ పక్షాన రైతుల సమస్యల పరిష్కారం కొరకు రైతు ప్రజా సంఘాల కార్యాచరణ సమితి భవిష్యత్తులో చేపట్టే ఆందోళన కార్యక్రమాలకు తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో రైతు ప్రజా సంఘాల జాతీయ నాయకులు పోలాడి రామారావు, మర్రి వెంకటస్వామి, రాష్ట్ర నాయకులు గూడూరి స్వామి రెడ్డి, సింగిల్ విండో అధ్యక్షులు ఎడవల్లి కుండాల్ రెడ్డి, బండి అయిలయ్య, కంకణాల సరోజన, కాశిరెడ్డి మహేందర్ రెడ్డి, గోలి సరోజన, పుర్రె మల్లయ్య, చెవుల సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారుల నూతన గృహప్రవేశానికి హాజరైన ప్రణవ్

### - కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ హయంలో లబ్ధిదారులకు మేలు

### - రానున్న రోజుల్లో రెండవ విడత ఇందిరమ్మ ఇళ్ల పంపిణీ



హుజురాబాద్ మార్చి 14 (వాయిస్ టుడే): రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇళ్లు లేని నిరుపేదలకు ఇళ్లిచ్చి వారిని ఆదుకుంటున్నామని తద్వారా, ఇళ్లు కట్టుకోవాలనుకున్న వారి కలను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేరుస్తున్నామని హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ అన్నారు. శనివారం నాడు హుజూరాబాద్ మండల పరిధిలోని శాలపల్లి (ఇందిరానగర్),కాట్రపల్లిలో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇంటి గృహ ప్రవేశానికి కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి ముఖ్య అతిథిగా ప్రణవ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏళ్ల కల నెరవేరుతున్న సందర్భంలో లబ్ధిదారులు ప్రణవ్ కు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జీవితంలో సొంతింటి కల అనేది మనిషి ముఖ్య ఉద్దేశ్యమని దాన్ని కాంగ్రెస్ పార్టీ నెరవేర్చడం పట్ల లబ్ధిదారులు సంతోషంగా ఉన్నారని,వారి ఆశలకు అనుగుణంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని అన్నారు.ఏప్రిల్ చివరి వారంలో రెండవ విడత ఇందిరమ్మ ఇళ్ల పంపిణీకి ప్రభుత్వం సిద్ధంగా ఉందని,అర్హులైన లబ్ధిదారులు ఆందోళన చెందవద్దని సూచించారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక్కొక్కటిగా సమస్యలకు పరిష్కారం చూపెడుతున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో హుజూరాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ సుహాసిని, కౌన్సిలర్లు, సర్పంచులు,వార్డు సభ్యులు మండల,పట్టణ అధ్యక్షులు,మహిళా నాయకులు, సీనియర్ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలి



తొర్రూరు, మార్చి 14 వాయిస్ టుడే : పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలని నాంచారి మడూరు సర్పంచ్ బంగారు రమేష్, ఎంజేపీ బీసీ సంక్షేమ బాలుర గురుకుల డిగ్రీ కళాశాల డాక్టర్ ఏరుకొండ హరిప్రసాద్ అన్నారు. మండలంలోని నాంచారి మడూరు గ్రామంలో ఎం జె పి బీసీ బాలుర గురుకుల డిగ్రీ కళాశాల జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) క్యాంపులో భాగంగా మూడోరోజు నవనమహోత్సవ కార్యక్రమం నిర్వహించారు. దానిలో భాగంగా గ్రామపంచాయతీ ఆవరణలో సర్పంచ్ బంగారు రమేష్, ప్రిన్సిపాల్ డాక్టర్ హరిప్రసాదులు మొక్కలు నాటారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ గిరి ప్రసాద్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో సర్పంచ్, ప్రిన్సిపాల్ మాట్లాడారు.

ప్లాస్టిక్ వినియోగంతో జలకాలుష్యం ఏర్పడి పర్యావరణం దెబ్బతింటుందన్నారు. ప్రకృతిని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. విద్యార్థులు సేవా భావాన్ని అలవర్చుకొని దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. చదువుతోపాటు సేవాగుణాన్ని అలవర్చుకోవడం ద్వారా భవిష్యత్తులో మంచి స్థాయికి చేరుకుంటారని, మానవసేవే మాధవ సేవ అని పేర్కొన్నారు. జాతీయ సేవా పథకం క్యాంపులో పాల్గొనడం ద్వారా అందించే సర్టిఫికెట్ భవిష్యత్తులో ఎంతో ఉపయోగపడుతుందన్నారు. విద్యార్థులు ఉత్తమ మానవ వనరులుగా తీర్చిదిద్దడమే ఎన్ఎస్ఎస్ లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ రేవ్యా నాయక్, అధ్యాపకులు, వలంటీర్లు పాల్గొన్నారు.



## 37,వ డివిజన్ లో పేదలకు పండ్లు పంపిణీ చేసిన కాంగ్రెస్ నాయకులు..

వరంగల్ ( వాయిస్ టుడే ) మార్చి 14 : వరంగల్ ఈస్ట్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు, కాంటెస్టెడ్ కార్పొరేటర్ బెడద వీరన్న పెండ్లి రోజు అలాగే వారి కుమారుడు బెడద సాయి చరణ్ పుట్టిన రోజు సందర్భంగా కొండా యూవసేన మండల అధ్యక్షులు ఇప్ప నరేష్,ఓబీసీ సెల్ 37,వ డివిజన్ అధ్యక్షులు సిరబోయిన గిరి, ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు కలకోట్ల కుమార్ ఆధ్వర్యంలో శనివారం నాడు డివిజన్ లో పేదలకు పండ్లు పంపిణీ చేసి పెండ్లి రోజు, జన్మదిన వేడుకలను కాంగ్రెస్ నాయకులు కార్యకర్తల నడుమ ఘనంగా జరుపుకోన్నారు. ఈ కార్యక్రమము లో 37వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బోయిని గూడయ్య యాదవ్, స్వయం శంభు లింగేశ్వర స్వామి దేవస్థానం చైర్మన్ బంగారు శ్రీనివాస్,కాంగ్రెస్ నాయకులు అర్థం రాంబాబు, నలువెల శివకుమార్ ఆదర్శ మెడికల్, 37 వ డివిజన్ మహిళా కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలు మైదాం లత, 37వ డివిజన్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు సిరబోయిన కిరణ్, 16 బ్లాక్ కాంగ్రెస్ నాయకులు బోలు గొడ్డు రఘు, బానోత్ జగన్, తోట ప్రభాకర్, బరిగెల సతీష్, ఐలయ్య టీచర్, కందిమల్ల రాజేందర్, బైరి శ్రీనివాస్ గౌడ్, కట్కూరి వంశీ స్థానిక ప్రజలు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## నవాబుపేటలో ఘనంగా పెద్దమ్మ తల్లి బోనాలు

### భక్తులకు పెద్ద ఎత్తున అన్నప్రసాదం

చిగురుమామిడి, మార్చి 14 (వాయిస్ టుడే): ముదిరాజుల ఆరాధ్య దైవమైన శ్రీ పెద్దమ్మ తల్లి బోనాల మహోత్సవం చిగురుమామిడి మండలం నవాబుపేట గ్రామంలో శనివారం రాత్రి భక్తి శ్రద్ధలతో అత్యంత వైభవంగా నిర్వహించారు. నవాబుపేట ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు భారీగా పాల్గొని అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. గ్రామంలోని ప్రతి గడప నుంచి మహిళలు సంప్రదాయ బోనాలు ఎత్తుకొని డప్పు చప్పుళ్ల మధ్య, శివసత్తుల పూనకాలు, బైండ్ల వారి నృత్యాలతో ఊరంతా భక్తి పరవశంతో కళకళలాడింది. ఈ బోనాల ఊరేగింపు ఆలయం వరకు చేరుకునేంతవరకు గ్రామంలో ఉత్సాహభరిత వాతావరణం నెలకొంది. గ్రామ ప్రజలు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఈ సందర్భంగా ఉదయం నుంచే శ్రీ పెద్దమ్మ తల్లి ఆలయానికి భక్తులు తరలివచ్చి ప్రత్యేక అర్చనలు, పూజలు నిర్వహించారు. అంతేకాకుండా శుక్రవారం రాత్రి పోచమ్మ తల్లి బోనాలను కూడా అత్యంత ఘనంగా నిర్వహించారు. అమ్మవారి కటాక్షంతో ప్రజలందరూ సుఖసంతోషాలతో సుభిక్షంగా ఉండాలని, రైతులకు పంటలు బాగా పండాలని భక్తులు ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా పెద్ద బోనం గూళ్ల రవి ఇంటి నుంచి, ఘటం కుండా



గూళ్ల వీరయ్య ఇంటి నుంచి తీసుకువచ్చి శ్రీ పెద్దమ్మ తల్లికి సమర్పించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో భక్తులకు పెద్ద ఎత్తున అన్నప్రసాద కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామస్థులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనడంతో నవాబుపేట గ్రామం భక్తి పరవశంతో మోగిపోయింది. ఈ కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు గూళ్ల బాలయ్య, కుల పెద్దమనిషి గూళ్ల కనకయ్య, సర్పంచ్ గూళ్ల రజిత-రాజు, ఉపాధ్యక్షులు గూళ్ల వెంకటేశం, కార్యదర్శి పిల్లి కొమురయ్య, సొసైటీ సభ్యులు గూళ్ల రవి, గూళ్ల బాలయ్య, పిల్లి వేణు, పిల్లి రమేష్, పిల్లి శ్రీనివాస్, పోలవేణి సంపత్, హనుమాండ్ల సత్యనారాయణ, గూళ్ల కిష్టయ్య, గూళ్ల వీరయ్య, గుళ్ళ సంతోష్, దామ శ్రీనివాస్, గుళ్ళ రాజు, గూళ్ల శ్రావణ్ పాల్గొన్నారు.

# పేదల వైద్యానికి ప్రభుత్వం పెద్దపీట

## ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి



మానకొండూర్,మార్చి 14(వాయిస్ టుడే): నిరుపేదల వైద్యానికి తెలంగాణ ప్రభుత్వం పెద్దపీట వేస్తున్నదని టీపీసీసీ ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు,మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ చెప్పారు.పెద్ద లింగాపూర్ గ్రామంలో వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం పేదల వైద్యానికి అధిక ప్రాధాన్యతనిస్తోందన్నారు. అందులో భాగంగానే గ్రామీణ ప్రాంతాల్లో వైద్యఆరోగ్యశాఖ ద్వారా ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. మారుమూల గ్రామాలకు ఈ శిబిరాలను మరింత విస్తరింపజేస్తామన్నారు.బీఆర్ఎస్ హయాంలో పేదల వైద్యాన్ని ఏమాత్రం పట్టించుకోలేదని ఆయన విమర్శించారు. రేవంత్ రెడ్డి సర్కార్ ప్రభుత్వ ఆస్పత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మౌళిక వసతులు కల్పించడమే కాకుండా అవసరమైన అన్ని రకాల మందులు అందుబాటులో ఉంచుతున్నదన్నారు. అలాగే ఖాళీగా ఉన్న డాక్టర్ల పోస్టులతోపాటు వైద్యేతర సిబ్బందిని నియమిస్తున్నదని ఆయన గుర్తు చేశారు.గ్రామీణ ప్రాంత ప్రజలకు ఆరోగ్యం పట్ల అవగాహన కల్పించేందుకు వైద్య శిబిరాలు ఎంతగానో దోహదపడతాయని ఎమ్మెల్యే కవ్వంపల్లి పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మండల వైద్యాధికారి డాక్టర్ జీవన, ఇల్లంతకుంట మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి భాస్కర్ రెడ్డి, గ్రామ సర్పంచ్ జి.వసంత-నర్సయ్య,పార్టీ నాయకులు ఊట్కూరి వెంకట రమణారెడ్డి,గుడిసె అయిలయ్య, ఐరెడ్డి మహేందర్ రెడ్డి,ఎల్గందుల ప్రసాద్,రాజేందర్ రెడ్డి,నవీన్ రెడ్డి,పసుల వెంకటి,మామిడి రాజు పాల్గొన్నారు.వల్లంపట్ల గ్రామంలో నూతనంగా నిర్మించతలపెట్టిన అంగన్ వాడీ కేంద్ర భవనానికి మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ భూమిపూజ చేశారు.ఈ కార్యక్రమంలో వల్లంపట్ల గ్రామ సర్పంచ్ నేరెళ్ల విజయ్ గౌడ్,మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి భాస్కర్ రెడ్డి,మాజీ ఎంపీపీలు ఊట్కూరి వెంకట రమణారెడ్డి,గుడిసె అయిలయ్య,పార్టీ నాయకులు ఐరెడ్డి మహేందర్ రెడ్డి,ఎలగందుల ప్రసాద్, పసుల వెంకటి,కాత మల్లేశం, మామిడి రాజు,శ్రీనివాస్ పాల్గొన్నారు.

## బాలికపై వేధింపులు.. ఒకరి అరెస్ట్

### మైనర్ బాలుడిని ఉసిగొల్పిన నిందితుడు రిమాండ్



చందుర్తి మార్చి, 14 ( వాయిస్ టుడే): సోషల్ మీడియా వేదికగా ఒక మైనర్ బాలికను వేధింపులకు గురిచేస్తున్న కేసులో చందుర్తి పోలీసులు ఒకరిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ ఘటనకు సంబంధించిన వివరాలను చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు శనివారం మీడియాకు వెల్లడించారు. మండలంలోని బండపల్లి గ్రామానికి చెందిన పల్లపు నవీన్ అనే వ్యక్తి తన వద్ద పని చేసే ఒక మైనర్ బాలుడిని ఇన్ స్టాగ్రామ్ ద్వారా ఒక బాలికకు అసభ్యకర సందేశాలు పంపేలా ప్రోత్సహించాడు. సదరు బాలిక సందేశాలను నిరాకరించినప్పటికీ, వేధింపులు ఆపవద్దంటూ బాలుడిని నవీన్ నిరంతరం ఉసిగొల్పుతూ వచ్చాడు. ప్రేమ పాఠాల పేరుతో మైనర్లను తప్పుదోవ పట్టించడమే కాకుండా, వేధింపులకు సహకరించడంపై పోలీసులు తీవ్రంగా పరిగణించారు.



## మహిళా సాధికారతకు 'పెరటి కోళ్లు' ఊతం

### కోనరావుపేట మండల కేంద్రంలో ఐకెపి ఆధ్వర్యంలో పంపిణీ

### సర్పంచ్ మస్కూరు కాశిరాం చేతుల మీదుగా అందజేత

కోనరావుపేట, మార్చి 14 (వాయిస్ టుడే ): మహిళలు ఆర్థికంగా ఎదగాలనే లక్ష్యంతో ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలు క్షేత్రస్థాయిలో సత్ఫలితాలనిస్తున్నాయి. శనివారం కోనరావుపేట మండల కేంద్రంలో ఐకెపి (IKP) మహిళా సంఘాల సభ్యులకు ఉపాధి నిమిత్తం పెరటి కోళ్లను పంపిణీ చేశారు. గ్రామ సర్పంచ్ మస్కూరు కాశిరాం ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై కోళ్లను అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, మహిళలు ఇంటి వద్దే ఉంటూ అదనపు ఆదాయం పొందేందుకు పెరటి కోళ్ల పెంపకం ఎంతో లాభదాయకమని పేర్కొన్నారు. ఐకెపి సంఘాల ద్వారా గ్రూపు సభ్యులకు ఈ అవకాశం కల్పించడం వల్ల వారి కుటుంబాల్లో ఆర్థిక భరోసా కలుగుతుందని హర్షం వ్యక్తం చేశారు.



## కాంగ్రెస్‌లో చేరిన జంగపల్లి సర్పంచ్, ఉప సర్పంచ్

### సాదరంగా ఆహ్వానించిన ఎమ్మెల్యే కవ్వంపల్లి

తిమ్మాపూర్,మార్చి14(వాయిస్ టుడే): గన్నేరువరం మండలం జంగపల్లి గ్రామ సర్పంచ్ తాడూరి కరుణశ్రీ వెంకట్ రెడ్డి,ఉప సర్పంచ్ మహంకాళి ప్రభాకర్ కాంగ్రెస్ పార్టీలో చేరారు.ఎల్ఎండి కాలనీలోని ప్రజాభవన్ లో మానకొండూరు ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ వారికి కండువాలు కప్పి కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించారు.అలాగే వారితోపాటు వార్డు సభ్యులు ఇరుమాండ్ల ఎల్లేష్, అలువాల ప్రదీప్ కూడా కాంగ్రెస్ పార్టీలో చేరిన వారిలో ఉన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ గన్నేరువరం మండలంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి అందరితో కలిసి పనిచేయాలని కోరారు.అలాగే ప్రభుత్వ సంక్షేమ పథకాలు పేదలకు చేరే విధంగా చూడాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో గన్నేరువరం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ముస్కు ఉపేందర్ రెడ్డి,జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు కొమ్మెర రవీందర్ రెడ్డి,పార్టీ నాయకులు అలువాల కోటి,నందికొండ తిరుపతిరెడ్డి, మోరపల్లి రమణారెడ్డి పాల్గొన్నారు.

## దోపిడి రహిత సమాజం కోసం పరితపించిన వ్యక్తి కారల్ మార్క్స్

### ప్రపంచ కార్మిక వర్గానికి దిక్సూచి ఆయన రచనలు.

### సిపిఐ సీనియర్ నాయకుడు,మాజీ ఎమ్మెల్యే చాడ వెంకట రెడ్డి

కరీంనగర్,మార్చి 14(వాయిస్ టుడే): ధనిక,పేద అనే తేడా లేని దోపిడి రహిత సమాజం కోసం తన జీవితమంతా పరితపించిన వ్యక్తి కారల్ మార్క్స్,ప్రపంచ వ్యాపితంగా శ్రమ దోపిడీకి గురవుతున్న కార్మిక వర్గానికి దిక్సూచిలాగా ఆయన రచించినలు ఉన్నాయని సిపిఐ సీనియర్ నాయకుడు,మాజీ ఎమ్మెల్యే చాడ వెంకట రెడ్డి కొనియాడారు. సిపిఐ కరీంనగర్ జిల్లా సమితి ఆధ్వర్యంలో బద్దం ఎల్లారెడ్డి భవన్ వద్ద కారల్ మార్క్స్ 143వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్ తో కలిసి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా చాడ వెంకట రెడ్డి మాట్లాడుతూ తన జీవితం మొత్తం ప్రజల సంతోషానికి అంకితం చేసిన గొప్ప దార్శనికుడు కారల్ మార్క్స్ అని గుర్తు చేశారు. సమాజ పోకడలను అధ్యయనం చేసి 1847లోనే కమ్యూనిస్టు ప్రణాళికను రాసి కార్మిక వర్గానికి వెలుగు బాటలు వేసాడని అన్నారు.సమాజంలోని సంపద ఫలాలు సమానంగా



అందరికీ దక్కాలని, శ్రమ దోపిడి లేని, వర్గ రహిత సమాజం కోసం క్రుషి చేశాడని అన్నారు.ప్రపంచ మానవాళి చరిత్రను మలుపు తిప్పిన మహోన్నత వ్యక్తి కారల్ మార్క్స్ అన్నారు.ప్రపంచంలో నేటికి మార్క్స్ సిద్దాంతాన్ని విమర్శించలేరని,విమర్శించడమంటే సూర్యునిపై ఉమ్మినట్లుగా ఉంటుందని అన్నారు.మార్క్సిజం అజేయమైందని,ప్రతి ఒక్కరు ఆచరించి సమసమాజ స్థాపన కోసం ప్రజలంతా ఒక్కటి కావాలని వెంకటరెడ్డి పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పొనగంటి కేదారి,అందె స్వామి,నగర కార్యదర్శి కసిరెడ్డి సురేందర్ రెడ్డి,చిగురు మామిడి, తిమ్మాపూర్,శంకరపట్నం, మానకొండూర్,మండలాలకు కార్యదర్శులు నాగెల్లి లక్ష్మారెడ్డి, బోయిని తిరుపతి,పిట్టల సమ్మయ్య, బండ రాజిరెడ్డి,జిల్లా కార్యవర్గ కౌన్సిల్ సభ్యులు గూడెం లక్ష్మి,టేకుమల్ల సమ్మయ్య,న్యాలపట్ల రాజు,కటిక రెడ్డి బుచన్న,బీర్ల పద్మ, కొట్టే అంజలి, నాయకులు కూన రవి,బాకం ఆంజనేయులు,నగునూరి రమేష్, భారతి, ఆవునూరి రమేష్ పాల్గొన్నారు.




## గృహ అవసరాలకు సైతం ఉపయోగపడే మొక్కలు పెంచాలి

### మొక్కల సంరక్షణ కు ప్రత్యేక చర్యలు తీసుకోవాలి

### రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్.

### ప్రజా పాలన -ప్రగతి ప్రణాళిక లో భాగం గా నర్సరీల్లో పరిశీలన.

సిరిసిల్ల, మార్చి 14 (వాయిస్ టుడే) గృహ అవసరాలకు సైతం ఉపయోగ పడే మొక్కలను నర్సరీల్లో పెంచాలని మున్సిపల్ అధికారులను కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక లో భాగం గా సిరిసిల్ల పట్టణం లోని సాయి నగర్, జే పీ నగర్ లో సిరిసిల్ల మున్సిపల్ ఆధ్వర్యం లో ఏర్పాటు చేసిన నర్సరీల ను కలెక్టర్ శనివారం పరిశీలించారు. ఈ సందర్భం గా ఆయా నర్సరీల్లో ఎన్ని రకాలు, ఎన్ని మొక్కలు పెంచు తున్నారనే వివరాలు అడిగి తెలుసుకున్నారు. నర్సరీ మొత్తం పరిశీలించి అధికారుల కు పలు సూచనలు చేశారు. ఈ సందర్భం గా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. సిరిసిల్ల మున్సిపల్ ఆధ్వర్యం లోని నర్సరీ లో రోడ్ల వెంట, అలాగే ఇతర చోట్ల నాటే మొక్కలతో పాటుగా గృహ వినియోగానికి ఉపయోగపడే మొక్కలు సైతం పెంచాలని సూచించారు. మునగ పండ్ల, ఇతర రకాల మొక్కలను నర్సరీ ల్లో సిద్ధం గా ఉంచాలని ఆదేశించారు. ఎండా కాలం నేపథ్యం లో మొక్కలకు నీటిని పడుతూ సంరక్షించాలని సూచిం చారు. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణం గా ప్రణాళిక ప్రకారం మొక్కలను సిద్ధం గా ఉంచాలని స్పష్టం చేశారు. ఈ పరిశీలన లో మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళ ఆర్డిఓ వెంకటేశ్వర్లు, మున్సిపల్ కమిషనర్ ఖదీర్ పాషా, అధికారులు, సిబ్బంది తదితరులు ఉన్నారు.

## వేములవాడ లో శ్రీ భీమేశ్వర స్వామిని దర్శించుకున్న జడ్చర్ల ఎమ్మెల్యే



వేములవాడ, మార్చి 14 (వాయిస్ టుడే) రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ లోని శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం అనుబంధ ఆలయమైన శ్రీ భీమేశ్వర స్వామి ఆలయాన్ని జడ్చర్ల శాసనసభ్యులు అనిరుద్ రెడ్డి దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న ఎమ్మెల్యే ని ఆలయ అర్చకులు స్వస్తి వచనాల తో ఘనంగా స్వాగతించారు. అనంతరం ఆయన స్వామివారికి కోడె మొక్కులు చెల్లించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారి మండపంలో ఆలయ అర్చకులు, వేద పండితులు ఎమ్మెల్యే కు ఆశీర్వచనం అందజేశారు. ఆలయ ఈవో రమాదేవి ఎమ్మెల్యేకు స్వామి వారి లడ్డూ ప్రసాదం అందించారు. ఈ కార్యక్రమం లో ఆలయ అర్చకులు, వేద పండితులు, ఆలయ ఉద్యోగులు పాల్గొన్నారు.



## 10వ తరగతి పరీక్ష కేంద్రాలను క్షేత్ర స్థాయిలో పరిశీలించిన జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే

### పరీక్ష కేంద్రాల వద్ద పటిష్టమైన బందోబస్తు

### 163 బిఎన్ఎస్ఎస్ (సెక్షన్ 144) అమలు.

రాజన్న సిరిసిల్ల జిల్లా, మార్చి 14 (వాయిస్ టుడే) పదవ తరగతి పరీక్షల సందర్భం గా సిరిసిల్ల పట్టణ పరిధి లోని గీతనగర్ లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కుసుమరామయ్య పాఠశాల లో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాలన్ని జిల్లా ఎస్పీ క్షేత్ర స్థాయి లో పరిశీలించి, పరీక్షలు ప్రశాంత వాతావరణం లో నిర్వహించబడుతున్న తీరును సమీక్షించి, కేంద్రాల వద్ద విధుల్లో ఉన్న పోలీస్ అధికారులకు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన 34 పరీక్షా కేంద్రాల వద్ద పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎస్పీ తెలిపారు. పరీక్షలు సజావుగా, అవాంఛనీయ ఘటనలు లేకుండా జరగడానికి 163 బిఎన్ఎస్ఎస్ (సెక్షన్ 144) అమలు లో ఉంటుందని స్పష్టం చేశారు. పరీక్షల సమయంలో కేంద్రాల పరిసర ప్రాంతాల్లో నిరంతర పెట్రోలింగ్ నిర్వహించాలని, ఇద్దరు లేదా అంతకంటే ఎక్కువ మంది వ్యక్తులు పరీక్షా కేంద్రాల వద్ద గుమికూడకుండా చూడలన్నారు. పరీక్షల్లో అక్రమాలకు తావులేకుండా ఉండేందుకు పరీక్షా కేంద్రాల సమీపంలోని (100 మీటర్ల పరిధిలో) అన్ని ఫోటోకాపీ (జిరాక్స్), ఇంటర్నెట్ సెంటర్లను పరీక్షలు జరిగే రోజుల్లో ఉదయం 8:00 గంటల నుండి మధ్యాహ్నం 2:00 గంటల వరకు ఈ కేంద్రాలు మూసి ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. నిబంధనలను అతిక్రమించి పరీక్షా కేంద్రాల వద్ద గుమిగూడినా లేదా అనుమతి లేకుండా జిరాక్స్ సెంటర్లు తెరిచినా సంబంధిత వ్యక్తులపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసేలా ప్రజలందరూ సహకరించాలని కోరారు. ఎస్పీ వెంట,డిఎస్పీ నాగేంద్రచారి, పట్టణ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ సిబ్బంది ఉన్నారు.



## నిజాయితీకి నిదర్శనం...

### వేములవాడ భీమేశ్వర ఆలయంలో సానిటేషన్ కార్మికురాలు నాగమణి కి ఘన సత్కారం

వేములవాడ, మార్చి 14 ( వాయిస్ టుడే) రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ లోని శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం అనుబంధ ఆలయమైన శ్రీ భీమేశ్వర స్వామి ఆలయంలో నిజాయితీ కి నిదర్శనం గా నిలిచిన సానిటేషన్ కార్మికురాలు డబ్బు నాగమణి ని ఆలయ అధికారులు ఘనంగా సత్కరిం చారు గతం లో వరంగల్ జిల్లా లింగాల ఘనపురం మండలం కుందారం గ్రామానికి చెందిన రేసు సతీష్ అనే భక్తుడు స్వామివారి దర్శనార్థం ఆలయానికి వచ్చిన సమయం లో సుమారు నాలుగు తులాల బంగారు బ్రాస్లెట్‌ను (అంచనా విలువ సుమారు రూ.8 లక్షలు) ఆలయంలో ఎక్కడో పోగొట్టుకున్నారు. ఆలయం లో సానిటేషన్ పనులు నిర్వహిస్తున్న డబ్బు నాగమణి ఆ బ్రాస్లెట్‌ను గుర్తించి ఆలయ అధికారులకు అప్పగించారు. అనంతరం ఆలయ అధికారులు భక్తుడు రేసు సతీష్‌ను సంప్రదించి ఆయనకు ఆ బ్రాస్లెట్‌ను సురక్షితంగా తిరిగి అందజేశారు.నిజాయితీగా వ్యవహరించిన నాగమణి సేవలను ప్రశంసిస్తూ ఈ రోజు ఆలయ ఈవో రమాదేవి ఆమె ను ప్రత్యేకంగా సత్కరించారు. ఆలయం తరఫున ఒక చీర ను అందజేయడంతో పాటు ఈవో వ్యక్తి గతం గా మరో చీర ను కూడా అందించి అభినందించారు.గత కొన్ని సంవత్సరాలుగా ఆలయం లో సానిటేషన్ సేవలు అందిస్తూ నిజాయితీ తో విధులు నిర్వహిస్తున్న నాగమణి వంటి సిబ్బంది ఆలయానికి గర్వ కారణమని ఈవో రమాదేవి తెలిపారు.ఈ కార్యక్రమం లో ఆలయ ఉద్యోగులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.



## సాగునీటి రంగానికి పునర్వైభవం: ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

### చందుర్తి మండలంలో సుడిగాలి పర్యటన..

### డి4 కాలువ మరమ్మత్తులకు రూ. 21 లక్షల మంజూరు

చందుర్తి, మార్చి 14 (వాయిస్ టుడే): వేములవాడ నియోజకవర్గ రైతాంగానికి సాగునీటి కష్టాలు తీర్చడమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. శనివారం రాజన్న సిరిసిల్ల జిల్లా చందుర్తి మండలంలో ఆయన విస్తృతంగా పర్యటించారు. నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పెండింగ్ పనులను, ప్రాజెక్టులను పరిశీలించి అధికారులకు దిశానిర్దేశం చేశారు. రామన్నపేట గ్రామంలోని డి4 కాలువ అధ్వానంగా మారి సాగునీరు వృథా అవుతున్న విషయాన్ని రైతులు విప్ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై తక్షణమే స్పందించిన ఆది శ్రీనివాస్ గారు, కాలువ మరమ్మత్తు పనుల కోసం రూ. 21 లక్షల నిధులను మంజూరు చేయించారు. నిధులు మంజూరు కావడం పట్ల రామన్నపేట గ్రామ రైతులు హర్షం వ్యక్తం చేస్తూ ఆది శ్రీనివాస్ గారికి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం చందుర్తి ప్రాజెక్టును సందర్శించిన ఆయన, నీటి నిల్వ సామర్థ్యం మరియు కాలువల ద్వారా నీటి విడుదలపై అధికారులతో చర్చించారు. మల్యాల గ్రామంలోని పంప్ హౌస్‌ను సందర్శించి, దాని పనితీరును పరిశీలించారు. ఏవైనా సాంకేతిక లోపాలు ఉంటే వెంటనే సరిచేసి రైతులకు నిరంతరాయంగా నీరు అందేలా చూడాలని అధికారులను ఆదేశించారు.

వాయిస్ టుడే

హైదరాబాద్
ఆదివారం 15 మార్చి 2026



## ప్రభుత్వం ఆశవర్కర్ల డిమాండ్ లు నెరవేర్చాలి

### ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్

నిర్మల్ జిల్లా ప్రతినిధి వాయిస్ టుడే మార్చ్ 14: రాష్ట్ర ప్రభుత్వం ఆశా వర్కర్ల డిమాండ్ల నెరవేర్చాలని ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ డిమాండ్ చేశారు. తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి రావాలని ఆశ వర్కర్లు శనివారం అయన నివాసంలో వినతిపత్రం అందించిన సందర్భంగా మాట్లాడారు. చాలీచాలని వేతనాలతో ఆశ వర్కర్లు ఇబ్బందులు పడుతున్నారని కాంగ్రెస్ సర్కార్ ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం నెలకు 18 వేల రూపాయల వేతనం ఇవ్వాలన్నారు. వచ్చే అసెంబ్లీ సమావేశం లో బిజేఎల్పీ నేత మహేశ్వర్ రెడ్డి, లేదా తాను ఆశ వర్కర్ల తరఫున మాట్లాడనున్నట్లు చెప్పారు.. ఈ సందర్భంగా ఆశ వర్కర్ల సంఘం నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వం తమకు ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా వెట్టి చాకిరి చేయించుకుంటుందన్నారు. డిమాండ్లను నెరవేర్చకపోతే ఆందోళన పోరాటాలను తీవ్రతరం చేస్తామన్నారు. ఎమ్మెల్యేకు వినతి పత్రం సమర్పించిన వారిలో సంఘ నాయకులతో పాటు నియోజకవర్గంలోని ఆయా గ్రామాల నుండి పెద్ద మొత్తంలో ఆశ వర్కర్లు ఎమ్మెల్యే నివాసానికి తరలివచ్చారు.



## వి బి జి రామ్ జి చట్టాన్ని రద్దు చేయాలి

### సోన్‌లో ఉపాధి హామీ పనులను సందర్శించిన వ్యవసాయ కార్మిక సంఘం

నిర్మల్ జిల్లా ప్రతినిధి వాయిస్ టుడే మార్చ్ 14: కేంద్ర బిజెపి సర్కార్ తీసుకువచ్చిన విబిజి రాంజీ చట్టం వ్యవసాయ కూలీలకు తీవ్ర నష్టం చేసేదిగా ఉంది. ఈ చట్టం ద్వారా ఉపాధి హామీ కూలీలు పని అడిగే హక్కుని కోల్పోతున్నారు. ఈ చట్టం వలన ఇప్పటికే వ్యవసాయ కూలీలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు .ప్రతిరోజు ఉపాధి హామీ కూలీల కండ్ల ఫోటోలు తీయడం ,నాలుగు గంటల తర్వాత గ్రూప్ ఫోటో తీయడం కండ్ల ఫోటోలు తీసే సందర్భంలో అవి సరిగా నమోదు కాకపోవడం దానివల్ల కొందరు పని చేయలేక ఇంటికి తిరిగిపోతున్నారు. ఈ ఫోటోలు తీసేటటువంటి దానిని వెంటనే ఆపాలని వ్యవసాయ కార్మిక సంఘం ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తుంది. ఉపాధి హామీ కార్మికుల పనిని తొలగించడం కోసమే విబిజి రాంజీ చట్టాన్ని తీసుకువచ్చి బిజెపి సర్కార్ పేదల ఉపాధిని దెబ్బతిస్తుంది. కేంద్ర ప్రభుత్వం 90% ,రాష్ట్రప్రభుత్వం 10 మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి చట్టంలో చెల్లించవలసి ఉండగా బీజేపీ సర్కార్ తీసుకువచ్చిన విబి జి రాంజీ చట్టంలో కేంద్ర ప్రభుత్వం 60 శాతం రాష్ట్ర ప్రభుత్వం 40% చెల్లించాలని కొత్త నిబంధన పెట్టి ఉపాధి పని లేకుండా చేయడం కోసం కేంద్ర ప్రభుత్వం కుట్ర చేస్తుంది .

రాష్ట్ర ప్రభుత్వాలు 40% నిధులు చెల్లించడానికి ముందుకు రాకపోతే వ్యవసాయ కూలీలకు ఉపాధి హామీ పనులు దొరకవు.వ్యవసాయ కూలీలు సంఘటితమై ఉపాధి హామీ పనులను కాపాడుకోవాలని విబిజి రాంజీ చట్టం రద్దు అయ్యేంతవరకు పోరాటం చేయాలని మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని యధావిధిగా కొనసాగించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేయడం జరిగింది. ఉపాధి హామీ పనిని సందర్శించి కూలీలతో మాట్లాడిన వారిలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గం నూతన్ కుమార్ జిల్లా అధ్యక్షులు డాకూర్ తిరుపతి ,జిల్లా ఉపాధ్యక్షులు బర్కుంట గంగారం నాయకులు పానుగంటి నరేష్, సోన్ మండల కన్వీనర్ బక్కూరి రవీందర్ వ్యవసాయ ఉపాధిహామీ కూలీలు పత్తి రవి, తోర్తి రాజశేఖర్,తోర్తి బక్కన్న షేర్ ,నరసయ్య ,షేర్ మహేష్ తదితర మహిళా కూలీలు కూడా పాల్గొన్నారు.

## నిర్మల్ జిల్లా లోని ప్రభుత్వ హాస్టల్లో గ్యాస్ సిలిండర్ కొరతపై ఆమ్ ఆద్మీ పార్టీ తీవ్ర అగ్రహం




నిర్మల్ జిల్లా ప్రతినిధి వాయిస్ టుడే మార్చ్ 14: నిర్మల్ జిల్లా ఆమ్ ఆద్మీ పార్టీ కార్యాలయంలో విడుదల చేసిన ప్రకటన ద్వారా హాస్టల్ విద్యార్థుల కడుపు కొడుతున్న ప్రభుత్వం: గ్యాస్ సిలిండర్ల కొరతపై ఆమ్ ఆద్మీ పార్టీ తీవ్ర అగ్రహం వ్యక్తం చేశారు. నిర్మల్ జిల్లాలోని ప్రభుత్వ హాస్టళ్లలో గ్యాస్ సిలిండర్ల కొరతపై ఆమ్ ఆద్మీ పార్టీ తెలంగాణ రాష్ట్ర జాయింట్ సెక్రెటరీ సయ్యద్ హైదర్ ప్రభుత్వాన్ని ఘాటుగా నిలదీశారు. విద్యార్థుల భవిష్యత్తుతో ప్రభుత్వం ఆడుకుంటోందని ఆయన మండిపడ్డారు.

**ముఖ్యంగా ఆమ్ ఆద్మీ పార్టీ ప్రభుత్వంపై సంధించిన ప్రశ్నలు:**

పరీక్షల సమయంలో ఈ నిర్లక్ష్యమేంటి?: ప్రస్తుతం విద్యార్థులకు అత్యంత కీలకమైన పరీక్షల సమయం విద్యార్థులు చదువుపై ఏకాగ్రత వహించాల్సిన సమయంలో, హాస్టళ్లలో గ్యాస్ లేక వారు ఆకలితో అలమటించడం ప్రభుత్వ వైఫల్యం కాదా? అని ప్రశ్నించారు. కనీస అవసరాలు తీర్చలేని పాలన: హాస్టళ్లలో కనీసం వంట గ్యాస్ వంటి ప్రాథమిక అవసరాలను కూడా తీర్చలేకపోవడం ప్రభుత్వ అసమర్థతకు నిదర్శనం. అని అన్నారు అధికారులు మరియు ప్రభుత్వం దీనిపై ఎందుకు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని నిలదీశారు.

బడ్జెట్ ఏమవుతోంది?: విద్యార్థుల సంక్షేమం కోసం కేటాయించిన నిధులు ఏమవుతున్నాయి? జిల్లా యంత్రాంగం హాస్టళ్ల పర్యవేక్షణలో ఎందుకు విఫలమవుతోంది? అని అన్నారు. తక్షణ జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకుని, యుద్ధ ప్రాతిపదికన జిల్లాలోని అన్ని హాస్టళ్లలో గ్యాస్ సిలిండర్లను అందుబాటులోకి తీసుకురావాలి. నిరంతర సరఫరా: భవిష్యత్తులో ఇలాంటి కొరత రాకుండా గ్యాస్ ఏజెన్సీలతో సమన్వయం చేసుకుని శాశ్వత పరిష్కారం చూపాలి. విద్యార్థుల ఆకలి తీర్చలేని పక్షంలో, ఆమ్ ఆద్మీ పార్టీ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్త ఆందోళనలు చేపడతామని సయ్యద్ హైదర్ డిమాండ్ చేశారు.

# మతసామరస్యాన్ని ప్రతిబింబించిన ఇఫ్తార్ విందు

### - ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు



సుల్తానాబాద్ పెద్దపెల్లి జిల్లా మార్చి-14 వాయిస్ టుడే : సుల్తానాబాద్ మున్సిపల్ పట్టణంలోని పద్మనాయక కల్యాణ మండపం లో సుల్తానాబాద్ పట్టణ మండలంలోని ముస్లిం సోదరులకు శనివారం దావత్ ఇ ఇఫ్తార్ తామ్ విందును ఏర్పాటు చేసి అనంతరం ముస్లిం సోదరులకు, సోదరిమణులకు ముందస్తు రంజాన్ శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు, ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రతి సంవత్సరం పవిత్ర రంజాన్ మాసంలో ముస్లిం సోదరులు నెల రోజులు అత్యంత భక్తి శ్రద్దలతో ఉపవాసం తో సమాజంలో ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని వేడుకుంటారన్నారు. ఇఫ్తార్ విందులు మత సామరస్యానికి ప్రతీక గా నిలుస్తాయన్నారు. నెలరోజుల ఉపవాస దీక్షలో అనేక సత్ ప్రయోజనాలు కలుగుతాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ముస్లిం కుటుంబాలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. అనాది నుండి సుల్తానాబాద్ పట్టణంలో ముస్లిం సోదరులు కుల మతాలకు అతీతంగా సోదర భావంతో మెలుగుతారని అభినందించారు.అనంతరం ముస్లిం సోదరులతో కలిసి ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు.ఈ సందర్భంగా కార్యక్రమానికి విచ్చేసిన ఎమ్మెల్యేను స్థానిక ముస్లిం మతపెద్దలు, కాంగ్రెస్ ముస్లిం మైనార్టీ నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతటి అన్నయ్య గౌడ్, మున్సిపల్ చైర్మన్ బిరుదు రాధా కృష్ణ,మార్కెట్ చైర్మన్ మినుపాల ప్రకాష్ రావు, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు వేగోళం అబ్బయ్య గౌడ్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు చిలుక సతీష్, దాన్నాయక్ దామోదర్ రావు, సాయిరి మహేందర్, ఐల రమేష్, కౌన్సిలర్లు, మాజీ కౌన్సిలర్లు, ముస్లిం మత పెద్దలు, ముస్లిం సోదర సోదరీమణులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## రెండవ రోజు కొనసాగిన పలుగు పోచమ్మ తల్లి జాతర ఉత్సవాలు

### బండ్లు బోనాలు ఊరేగింపు



వాయిస్ టుడే నర్సాపూర్ : హత్నూర మండల పరిధిలోని షేర్ఖాన్పల్లి గ్రామంలో గల శ్రీ పలుగు మీద నల్ల పోచమ్మ తల్లి జాతర రెండవ రోజు ఘనంగా బండ్లు శివసత్తులు తో ఉత్సాహంగా జాతర నిర్వహించారు ఈ సందర్భంగా ఆలయ కార్యనిర్వణాధికారి దేవానందం మాట్లాడుతూ అమ్మవారి అమ్మవారికి రెండవ రోజు బండ్లు ఊరేగింపు చేయడం జరిగిందని ఆయన తెలిపారు ఈ జాతర ఉత్సవాలకు షేర్ ఖాన్ పల్లి గ్రామస్తులుచుట్టుపక్కల గ్రామాల నుండి గ్రామ ప్రజలు భారీ ఎత్తున వచ్చి విజయవంతం చేశారని ఆయన తెలిపారు అమ్మవారి కృప ప్రజలపై ఉండాలని ఆయన అమ్మవారిని వేడుకున్నారు ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు భక్తులు వేద పండితులు గ్రామస్తులు మహిళలు పాల్గొన్నారు.



## న్యూ వెల్మల్ గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి

నిర్మల్ జిల్లా ప్రతినిధి వాయిస్ టుడే మార్చ్ 14: సోన్ మండలం న్యూ వెల్మల్ గ్రామంలో రూ.20 లక్షలతో రెండు ఎస్ హెచ్ జి (వి ఓ) భవనాల నిర్మాణానికి, రూ. 20 లక్షలతో రెండు ఎస్ హెచ్ జి (వి ఓ) వర్కింగ్ షెడ్ ల నిర్మాణానికి, రూ.12 లక్షలతో అంగన్వాడీ భవన నిర్మాణానికి, రూ. 10 లక్షలతో జెడ్పిహెచ్ఎస్ స్కూల్ కాంపౌండ్ నిర్మాణానికి బీజేఎల్పీ నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రాచకొండ సాగర్, జిల్లా బీజేపీ అధ్యక్షులు రితేష్ రాథోడ్, సీనియర్ నాయకులు రావుల రాంనాథ్, సరికేల గంగన్న, మండల అధ్యక్షులు మార గంగారెడ్డి, మాజీ ఎంపీపీ హరీష్, నాగయ్య, తో పాటు మండల బీజేపీ నాయకులు కార్యకర్తలు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



## సమాజ సేవలో విఎన్ఆర్ ఫౌండేషన్

### - పదవ తరగతి విద్యార్థులకు మజ్జిగ పంపిణీ

సుల్తానాబాద్ పెద్దపెల్లి జిల్లా మార్చి-14 వాయిస్ టుడే : సామాజిక సేవలో విఎన్ఆర్ ఫౌండేషన్ అనేక కార్యక్రమాలను చేపడుతుందని ఆల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత వి. నరేందర్ రెడ్డి అన్నారు. పదవ తరగతి పరీక్షల సందర్భంగా విద్యార్థుల సౌకర్యార్థమై పరీక్ష కేంద్రాల వద్ద విఎన్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆధినేత నరేందర్ రెడ్డి మాట్లాడుతూ విద్యారంగంలో అనేక అద్భుతాలు సృష్టిస్తున్నామని అంతేకాకుండా సామాజిక సేవతో పాటు పేదవారికి విఎన్ఆర్ ఫౌండేషన్ ఎల్లప్పుడు అండగా ఉంటుందన్నారు ఎండ తీవ్రతలు అధికంగా ఉండడంతో విద్యార్థులను ఎండ దెబ్బకు గురి కాకుండా ఉండేందుకు మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు కార్యక్రమంలో విఎన్ఆర్ ఫౌండేషన్ ప్రతినిధులు గోపతి సత్యం, బి. రవీందర్, వేముల కిరణ్, రామకృష్ణ, ఇక్బాల్ తదితరులున్నారు.



## ఘనంగా భూలక్ష్మి -- మహాలక్ష్మి బొడ్రాయి దేవతల ప్రతిష్టాపన కార్యక్రమం

సుల్తానాబాద్ పెద్దపెల్లి జిల్లా మార్చి-14 వాయిస్ టుడే : సుల్తానాబాద్ పట్టణంలోని ఎనిమిదవ వార్డు అశోక్ నగర్లో భూలక్ష్మి, మహాలక్ష్మి బొడ్రాయి దేవతల ప్రతిష్టాపన కార్యక్రమం శనివారం ఘనంగా నిర్వహించారు. ఇట్టి కార్యక్రమానికి పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయ రమణారావు ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజల్లో పాల్గొని దేవతల ఆశీర్వాదాలు పొందారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు మాట్లాడుతూ, గ్రామాల్లో బొడ్రాయి దేవతల ప్రతిష్టాపన వంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు ప్రజల్లో ఐక్యత, సాంప్రదాయ విలువలను పెంపొందిస్తాయన్నారు. ఇలాంటి కార్యక్రమాలు గ్రామాలలో శాంతి, సౌభ్రాతృత్వం నెలకొల్పడానికి దోహదపడతాయని పేర్కొన్నారు.భూలక్ష్మి, మహాలక్ష్మి దేవతల కృపతో పట్టణ ప్రజలు సుఖసంతోషాలతో, ఐశ్వర్యంతో ఉండాలని కోరుకుంటూ, అందరికీ దేవతల ఆశీస్సులు లభించాలని ఆకాంక్షించారు. భక్తి భావంతో నిర్వహించిన ఈ కార్యక్రమం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మినుపాల ప్రకాష్ రావు, మున్సిపల్ చైర్మన్ బిరుదు రాధాకృష్ణ, శ్రీగిరి శ్రీనివాస్, ఎనిమిదవ వార్డు కౌన్సిలర్ చింతల రాజు, ఈర్ల శేఖర్ గంగపుత్ర సంఘ సభ్యులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## అందరూ కలిసింటూనే గౌరవం

### మహిళలు అన్ని రంగాల్లో విజయం సాధించాలి: మంజుల పత్తిపాటి




ఆలేరు,మార్చి 14(వాయిస్ టుడే): మహిళలు అన్ని రంగాల్లో విజయాలు సాధించాలని సామాజిక కార్యకర్త,కవయిత్రి మంజుల పత్తిపాటి అన్నారు. యాదగిరిగుట్టలో రెడ్డి సంక్షేమ సంఘం పంక్షన్ హాల్ తెలంగాణ కరణం నియోగ బ్రాహ్మణ సంఘం సర్వసభ్య సమావేశంలో తెలంగాణకు చెందిన ప్రముఖ మహిళా నాయకురాలు,సామాజిక కార్యకర్త మరియు కవయిత్రి మాజీ ఆలేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ మంజుల పత్తిపాటి మాట్లాడుతూ నేను ఒక కరణం ముద్దుబిడ్డను అని చెప్పుకోవడం నాకు గర్వకారణం,జరుగుతున్న ఈ సమావేశం

సాధారణ సమావేశం కాదు.ఇది మన చరిత్రను గుర్తు చేసే సమావేశం అని అన్నారు.ఒకప్పుడు గ్రామ గుండెల్లో వెలుగులు వెలిగించిన చేతులు మనవి.ప్రజల నమ్మకాన్ని నిలబెట్టిన అడుగులు మనవి,న్యాయం చెప్పిన స్వరం మనది.కానీ ఈ రోజు పరిస్థితి ఏమిటి?గ్రామాల్లో మనకు ఉన్న పరపతి తగ్గిపోయింది.కొన్ని చోట్ల అవమానాలు కూడా ఎదుర్కొంటున్నాం అని అన్నారు.

ఒకప్పుడు పులిలా జీవించిన మనం, ఇప్పుడు పిల్లిలా బ్రతుకుతున్న పరిస్థితి వచ్చింది.దానికి ప్రధాన కారణం ఏమిటంటే మన మధ్య ఐక్యత లేకపోవడం.మనలో చాలా మందిలో ఒక భావన పెరిగింది.నేను లాభపడకపోయినా పర్వాలేదు,నా పక్కవాడు లాభపడకూడదు అనే భావన.ఈ భావనతో మన సమాజం ముందుకు వెళ్లదు.ఒకరి బాధ అందరి బాధ కావాలి.ఒకరి విజయం అందరి విజయం కావాలి.అప్పుడే మన సమాజం బలపడుతుంది.అభివృద్ధి చెందుతుంది అని అన్నారు.ఈ సమావేశం కేవలం మన కోసం కాదు.మన తర్వాతి తరం మనలాగే కష్టాలు పడకూడదనే సంకల్పంతో జరుగుతున్న సమావేశం అని అన్నారు.మనము విడిపోయితే మన చరిత్ర మసక బారుతుంది.మనము కలిస్తే మన చరిత్ర మళ్లీ ప్రకాశిస్తుంది.ఒక మహిళగా నేను చెప్పేది ఒక్కటే,ఇంటిని నిలబెట్టేది మహిళ అయితే,మన సమాజాన్ని నిలబెట్టేది ఐక్యత.అందుకే మన చేతులు మళ్లీ కలవాలి.మన స్వరం మళ్లీ గర్జించాలి అని పిలుపునిచ్చారు.మన మధ్య దూరం పెరుగుతుందని,మన గౌరవం మెల్లగా తగ్గిపోతుందని గ్రహించిన మన అందరి ప్రియమైన బంధువు,బండారు రాం ప్రసాద్ రావు ఈ సమావేశం ఏర్పాటు చేయడం ఎంతో అభినందనీయం.వారి కృషి వల్లనే ఈ రోజు మనం అందరంఒకే వేదికపై కలిసే అవకాశం వచ్చింది అన్నారు.ఈ కార్యక్రమంలో చకిలం అనిల్ కుమార్, చందుపట్ల వెంకటేశ్వర రావు కరణం, నాయకులు పాల్గొన్నారు.